# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 164 | హైదరాబాద్ | శుక్రవారం 19-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

పేదరికం మాయమవుతుంది.. అందరికీ అధిక ఆదాయం వస్తుంది: ఎలాన్ మస్క్

## నేటి భారతం

- గ్రామ స్వరాజ్యం కోసం ఎన్నో కలలు గన్న బాపూజీ ఆశయాలు తుంగలో తొక్క బడ్డాయి..
- గ్రామ సర్పంచ్ అనగానే చీప్ గా చూడటం సోకార్డ్ రాజకీయ పార్టీలకు అలవాటు అయిపోయింది..
- కానీ గ్రామ సర్పంచులు అనేవారు లేకపోతే ఎమ్మెల్యేలు లేరు ఎంపీలు లేరు చివరికి ముఖ్యమంత్రి కూడా లేరు...
- ఈ వాస్తవాన్ని గాలికి వదిలేసిన టిఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్లను నరకయాతనకు గురిచేసింది..
- అందుకే ఫలితం అనుభవించి ఓటమి మూటగట్టుకుంది..
- మరి కాంగ్రెస్ ప్రభుత్వమైన సర్పంచ్లను పట్టించుకుంటుందా..?
- వారి విలువను కాపాడుతుందా..?
- చరిత్రలో నిలిచిపోతుందా..? చరిత్ర హీనంగా మిగిలి పోతుందా..? వేచి చూద్దాం..

– ఇంద్రిపల్లి. గోవర్ధన్, అంబేద్కరిస్ట్

## కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరు..

ఆయనతో ప్రయోజనం లేదని గజ్వేల్ ప్రజలకు అర్థమైంది : రేవంత్ రెడ్డి

- పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు వచ్చాయన్న ముఖ్యమంత్రి
- కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఒక్క ఎన్నికను కూడా గెలవలేదని విమర్శ
- 2029 ఎన్నికల్లోనూ ఇవే పునరావృతమవుతాయని వ్యాఖ్య

11లో





11లో

## విచారణలో నోరు విప్పిన ఐబొమ్మ రవి..

- శాటిలైట్ లింక్, క్యూబ్ నెట్‌వర్క్ హ్యాక్ చేసినట్లు వెల్లడి
- హెచ్‌డీ హబ్ టెలిగ్రామ్ ఛానల్ ద్వారా పైరసీ లింకుల అమ్మకం
- ఒక్కో లింక్‌కు 300 డాలర్ల వరకు వసూలు



## ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం

11లో

- 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను ప్రదానం చేసిన సుల్తాన్
- రెండు రోజుల క్రితం ఇథియోపియా నుంచి కూడా అత్యున్నత గౌరవం
- భారత్-ఒమన్ మధ్య కీలక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం
- ఇరు దేశాల 70 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా ఈ పర్యటన

## రష్యా సైన్యంలో 202 మంది భారతీయులు

- ఇప్పటివరకు 119 మందిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చినట్టు వెల్లడి
- మరో 50 మంది విడుదల కోసం రష్యాతో చర్చలు జరుపుతున్నట్టు ప్రకటన
- మరణించిన వారిలో 10 మంది మృతదేహాలను స్వదేశానికి తరలింపు
- మృతుల గుర్తింపు కోసం 18 కుటుంబాల డీఎన్ఏ శాంపిళ్లు రష్యాకు పంపినట్టు వెల్లడి




11లో

## 2 గంటలకు బాంబు పేలుతుంది

- నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు
- జడ్జిలు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులను బయటకు పంపించి తనిఖీలు చేపట్టిన పోలీసులు
- బెదిరింపుకు పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు సైబర్ పోలీసుల యత్నం

## బీ.ఆర్.ఎస్ పాలనలో నరకం చూశారు...




12లో

గ్రామ ప్రజాస్వామ్యానికి పునాది అయిన సర్పంచ్ వ్యవస్థ తెలంగాణలో గత పదేళ్లుగా నిస్సహాయ స్థితిలోకి నెట్టబడింది. "గ్రామానికి అధిపతి"గా ఎన్నికైన సర్పంచ్, వాస్తవానికి మాత్రం ఫైళ్లలో సంతకం చేసే బొమ్మ,గా మిగిలిపోయాడు.. అప్పల ఊబిలో చిక్కిన బాధితుడు, అధికారుల ముందు చేతులు జోడించే స్థాయికి దిగజారాడు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ పరిస్థితి మారుతుందేమో చూడాలి..

భారత శక్తి

# కాషాయంగా మారుతున్న అరుణం

కేరళలో భారతీయ జనతా పార్టీ వికసించడం ప్రారంభించింది. భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు ఓ సీఎం ఫేస్ కూడా రెడీగా ఉన్నారు . కాకపోతే ఆ ఫేస్ ఇంకా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. కానీ బీజేపీతో దగ్గరగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నా లేనట్లేగానే వ్యవహరిస్తున్నారు. ఆయనే శశిథరూర్. రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలంటే.. ముఖ్యంగా ఎదుగుతున్న పార్టీకి ఓ బలమైన నాయకత్వం కావాలి. కేరళలో ఇప్పటి వరకూ అలాంటి నాయకత్వాన్ని బీజేపీ పలుమార్లు టెస్ట్ చేసింది. రాజీవ్ చంద్రశేఖర్, సురేష్ గోపి సహా చాలా మందిని ప్రయత్నించింది. ఏదీ వర్కవుట్ కాలేదు. కానీ శశిథరూర్ మాత్రం అందరి కంటే బెస్ట్ ఆప్షన్ అవుతారుకేరళలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు పాలకవర్గం సిపిఎం నేతృత్వం లోని ఎల్‌డిఎఫ్‌కు, విపక్ష కాంగ్రెస్ సారథ్యంలోని యుడిఎఫ్‌కు గట్టి షాక్ ఇచ్చాయి. చివరకు కేరళ రాజకీయ తెరపై 'కమలం' విరిసింది. రానున్న ఏప్రిల్ మే నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి కూడా అధికారం చేపట్టేలా ఈ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రేరణ కలిగిస్తాయని ఎంతో కలలుగన్న ఎల్‌డిఎఫ్‌కు తీవ్ర ఆశాభంగం తప్పలేదు. గ్రామ పంచాయతీలు, బ్లాక్ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నేతృత్వం లోని విపక్షానికే చోటు లభించడం అనూహ్య పరిణామం. 14 జిల్లా పంచాయతీల్లో ఒక్కో ఫ్రంట్ చెరి సమాన సంఖ్యలో సీట్లు దక్కించుకున్నాయి. గత రెండు దశాబ్దాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ప్రజలను ప్రభావితం చేయడంలో పాలకవర్గం ఎల్‌డిఎఫ్ రికార్డు నెలకొల్పినప్పటికీ, ఈసారి దశాబ్ద కాలంగా అధికారంలో లేని యుడిఎఫ్ పైనే ఓటర్లు సానుభూతి చూపించడం ప్రత్యేకంగా గమనించవలసి ఉంది. ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మారే 50 ఏళ్ల సంప్రదాయాన్ని 2021 లో ఎల్‌డిఎఫ్ ఛేదించినా, ఈసారి ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువగానే కనిపించింది. శబరిమల అయ్యప్ప క్షేత్రంలోని బంగారు ఆభరణాల చోరీ, ఆలయ యాజమాన్య బోర్డు ప్రెసిడెంట్ అయిన సిపిఎం నాయకుని అరెస్టు, ఆయనపై తదుపరి చర్య తీసుకోవడానికి అధికార పార్టీ సిపిఎం అంగీకరించకపోవడం ఇవన్నీ అయ్యప్ప భక్తులకే కాదు, ప్రజలకు కూడా తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ విషయం లో అలసత్వం చూపిస్తే తీవ్ర పరిణామాలుంటాయని యుడిఎఫ్ హెచ్చరించింది కూడా. ఇక కాంగ్రెస్ నేతృత్వం లోని యుడిఫ్ విషయానికి వస్తే యువజన కాంగ్రెస్ శాసనసభ్యునిపై అత్యాచార కేసులు ఉన్నప్పటికీ, స్థానిక విజయం అసెంబ్లీ ఎన్నికల ముందు యుడిఎఫ్‌ను మరింత బలోపేతం చేసిందని చెప్పవచ్చు. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలున్నాయి. కానీ వాటి గురించి ప్రజలు పట్టించుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వమే ఆ సమస్యను పరిష్కరించుకుంటుందని విడిచిపెట్టి యుడిఎఫ్‌కే పట్టం కట్టారు. దీన్ని గమనించి పార్టీలోని అంతర్గత కుమ్ములాటల చిక్కుముడులను అధిష్ఠాన వర్గం ముందు పరిష్కరించక తప్పదు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారో ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆమేరకు స్థానిక నాయకత్వాన్ని పటిష్టపర్చాలి. ప్రజల్లో పార్టీపై నమ్మకం పెంచాలి. ఈ విజయావకాశాన్ని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు తిరిగి ప్రజలు పట్టం కట్టేలా కాంగ్రెస్ నేతృత్వం లోని యుడిఎఫ్ గట్టిగా నిర్మాణాత్మక కృషి సాగిస్తేనే కొంతవరకు నెగ్గుకు రాగలుగుతుంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఘన విజయం సాధించిన ఎన్‌డిఎ కూటమి కార్పొరేషన్ పాలనా పగ్గాలు చేపట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది.. తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో 45 ఏళ్లుగా ఎల్‌డిఎఫ్ పాలనే కొనసాగుతోంది. ఈసారి మొత్తం 101 వార్డుల్లో 50 వార్డులను బిజెపి (ఎన్‌డిఎ) గెల్చుకుంది. ఎల్‌డిఎఫ్‌కు 29 వార్డులు, యుడిఎఫ్‌కు 19 వార్డులు మాత్రమే దక్కాయి. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ఇంకా చాలా కాలం ఉన్నప్పటికీ తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం లోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈసారి గెలుపొందడానికి బిజెపి వ్యూహాలు రూపొందిస్తోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ ఎల్‌డిఎఫ్ 99, విపక్షం యుడిఎఫ్ 41 స్థానాలు గెల్చుకోగా, త్రిస్సూర్ స్థానాన్ని ఎన్‌డిఎ దక్కించుకుంది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డిఎ థర్డ్ ఫ్రంట్‌గా అవతరించకుండా ఉంటే స్థానిక సంస్థల విజయాలపై యుడిఎఫ్ మరింత ఉత్సాహంగా ఉండేది. రాష్ట్రంలో ఎక్కువగా ద్విపార్శ్వ సంకీర్ణ పోటీలు జరుగుతున్నాయి. ఈ పార్టీలు ఏ సమయంలో ఎటువైపు మొగ్గు చూపుతాయో చెప్పడం కష్టం. ఈ నేపథ్యంలో మూడవ ఫ్రంట్‌గా ఎన్‌డిఎ కూటమి అవతరించడం మిగతా పార్టీలన్నిటికీ గందరగోళంగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. దేశంలోనే ఏకైక వామపక్ష పాలక రాష్ట్రంగా కేవలం తన వ్యక్తిత్వంతో ఆదర్శాన్ని పినరయి విజయన్ ప్రదర్శించారు. ఇప్పుడు ఓటు వాటాల పరంగా వారి ఉనికితో సంబంధం లేకుండా ఎల్‌డిఎఫ్ ఓడిపోవడం వామపక్ష పార్టీలను ఓ మూలకు నెట్టేసినట్టే అవుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి సురేష్ గోపీ త్రిస్సూర్ లోక్‌సభ స్థానం నుంచి 74,686 ఓట్ల మెజార్టీతో చారిత్రాత్మక విజయం సాధించారు. బిజెపి ఏకైక ఎంపీగా నిలిచారు. ఈ విజయం కేరళ రాజకీయాల్లో త్రిముఖ పోటీకి నాంది పలికిందని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి విజయావకాశాలు మెండుగా ఉంటాయని కాషాయ నాథులు అంచనా వేశారు. కానీ లోక్‌సభ ఎన్నికల ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై ఏమాత్రం పడలేదు. కమలనాథుల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. 2020 నుంచి త్రిస్సూర్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు బిజెపికి తప్పుడు సంకేతాలనే అందిస్తున్నాయి.

# బుల్లెట్ ట్రైన్ పై అప్ డేట్...

తిరుపతి, డిసెంబర్ 18,

ఏపీ మీదుగా హైస్పీడ్ బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం కసరత్తు జరుగుతోంది. హైదరాబాద్ – బెంగళూరు మార్గంలో బుల్లెట్ రైలు నడపాలనే ఆలోచనలో కేంద్రం ఉంది. అందులో భాగంగా ఈ మార్గంలో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో మంగళవారం భూ పరీక్షలు నిర్వహించారు. ప్రతిపాదిత బుల్లెట్ రైల్వే లైన్ అనంతపురం జిల్లా మీదుగా వెళ్లే అవకాశం ఉండటంతో.. నిపుణులు పలుచోట్ల మట్టిని సేకరించి.. పరీక్షలు నిర్వహించారుఆంధ్రప్రదేశ్‌లో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు దిశగా కసరత్తు జరుగుతోంది. ఏపీలో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. దక్షిణాదిలో పెద్ద నగరాలైన హైదరాబాద్ – బెంగళూరు, అలాగే హైదరాబాద్ – చెన్నై నగరాల మధ్య బుల్లెట్ రైలు నడపాలని కేంద్రం భావిస్తోంది. అందుకు అనుగుణంగా ఈ మార్గాల్లో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. హైదరాబాద్ – బెంగళూరు బుల్లెట్ రైల్వే లైన్ ఏపీలోని అనంతపురం జిల్లా మీదుగా వెళ్తుంది. అలాగే హైదరాబాద్ – చెన్నై బుల్లెట్ రైల్వే లైన్ గుంటూరు జిల్లా మీదుగా వెళ్లేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ – బెంగళూరు హైస్పీడ్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం అధికారులు కసరత్తు మొదలెట్టారుఅందులో భాగంగా అనంతపురం జిల్లాలో పరీక్షలు నిర్వహించారు. హైస్పీడ్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం భూసామర్థ్యాన్ని నిర్ధారించేందుకు అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రోజున మట్టి పరీక్షలు చేశారు. అనంతపురం రూరల్ మండలం, బుక్కరాయసముద్రం మండలంలోని కొన్ని గ్రామాలతో పాటుగా, సిద్దరాంపురం పరిసరాల్లో నిపుణుల బృందం మట్టి పరీక్షలు నిర్వహించింది. 40 పాయింట్ల వద్ద నుంచి మట్టి నమూనాలను సేకరించినట్లు సమాచారం.మరోవైపు దక్షిణాదిలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతిలను అనుసంధానం చేస్తూ బుల్లెట్ రైలు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు గత కొంతకాలంగా కేంద్రానికి ప్రతిపాదిస్తున్నారు. ఈ బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం సర్వే కూడా మొదలైందని ఇటీవల సీఎం చంద్రబాబు వెల్లడించారు. విశాఖపట్నంలో జరిగిన ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్ 2025లో భాగంగా చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. త్వరలోనే దక్షిణ భారతదేశానికి కూడా బుల్లె?ట్ రైలు వస్తుందని చంద్రబాబు ఈ సందర్భంగా వెల్లడించారు. సర్వే కూడా పూర్తైందని.. హైదరాబాద్, చెన్నై, అమరావతి,




బెంగళూరును కలుపుతూ దీనిని ఏర్పాటు చేస్తారని చంద్రబాబు చెప్పుకొచ్చారు.ఈ నాలుగు నగరాల జనాభా కోట్లల్లో ఉందన్న చంద్రబాబు.. వీటిని అనుసంధానం చేస్తే ప్రపంచంలోనే అతిపెద్ద క్లస్టర్‌గా, అతిపెద్ద మార్కెట్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే బుల్లెట్ రైలు వస్తే దక్షిణాది ప్రాంత అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు మన దేశంలో తొలి బుల్లెట్ రైలును ముంబయి– అహ్మదాబాద్ మధ్య ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే దక్షిణాదిలోనూ బుల్లెట్ రైలు ఏర్పాటు చేస్తే.. నాలుగు ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందని... వాణిజ్యం, వ్యాపారం. వర్తకం, సాంస్కృతిక, పర్యాటకంగా నాలుగు ప్రాంతాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

=================

# గన్నవరంలో వంశీకి కలిసొచ్చేనా

విజయవాడ, డిసెంబర్ 18,

గన్నవరం రాజకీయాలు మళ్లీ గరం గరంగా మారనున్నాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తిరిగి గన్నవరం పాలిటిక్స్ లో యాక్టివ్ అయ్యారు. దాదాపు రెండేళ్ల పాటు గన్నవరం రాజకీయాలకు దూరంగా ఉన్న వల్లభనేని వంశీ తాజాగా ఇప్పుడు తిరిగి తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వల్లభనేని వంశీ తిరిగి యాక్టివ్ కావడంతో అక్కడ వైసీపీ కార్యక్రమాలు కూడా ఊపందుకున్నాయి. గన్నవరం నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తర్వాత కొన్ని నెలల పాటు జైల్లో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వల్లభనేని వంశీ రూపు రేఖలు కూడా జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత మారిపోయాయి.ఇప్పటికీ అదే రకంగా వల్లభనేని వంశీ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. గతంలో యువకుడిగా కనిపిస్తూ, జట్టుకు రంగు వేసుకుని కనిపించే వల్లభనేని వంశీ గత కొద్ది రోజుల నుంచి మాత్రం తెల్లజుట్టు, బక్కపలచగానే ఉన్నారు. అది కేవలం సెంటిమెంట్ తోనే వంశీ జనంలోకి వెళ్లి సింపతీని పొందాలనుకుంటున్నట్లుంది. అందుకే ఆయన తన రూపు రేఖలను మార్చుకునే ప్రయత్నం చేయడం లేదు. వల్లభనేని వంశీని గతంలో , ఇప్పుడు చూసిన వారికి పాపం.. అనిపించేలా వంశీ ఉండటం ఆయనకు కలసి వచ్చే అంశమని చెబుతున్నారు. జైల్లో 140 రోజుల పాటు ఉన్న వల్లభనేని వంశీ తెల్ల జుట్టుతో పాటు అనేక ఆరోగ్య పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వచ్చే ఎన్నికల వరకూ ఇదే రకంగా మెయిన్ టెయిన్ చేసి తిరిగి గెలుపొందేలా ప్లాన్ చేసుకున్నారని తెలిసింది.వల్లభనేని వంశీ ఇటీవల



వరసగా అనేక వివాహ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ టీడీపీ నేతలను కూడా పలుకరించడం, ఆత్మీయంగా దగ్గరకు తీసుకోవడం చర్చనీయాంశమైంది. వివాహ వేడుకలలో మాత్రమే కాకుండా అనేక కార్యక్రమాలకు కూడా ఆయన హాజరవుతున్నారు. గన్నవరం నియోజకవర్గంలో వల్లభనేని వంశీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలకు ధైర్యం చెబుతున్నారు. తాను ఎక్కడకూ వెళ్లనని, ఇక్కడే ఉండి రాజకీయాలను కొనసాగిస్తానని చెబుతున్నారు. తనపై పదకొండు కేసులు నమోదయ్యాయని, ఇంతకు మించి ఏం చేస్తారన్న ధీమా వల్లభనేని వంశీలో స్పష్టంగా కనిపిస్తుంది. గన్నవరం టీడీపీలో నెలకొన్న అసంతృప్తులను సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

===============

# సీతాగొందిలో ఉద్రిక్తత పోలీసులపై రాళ్ల దాడి

అదిలాబాద్ డిసెంబర్ 18,

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలో జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. సీతాగొంది గ్రామ పంచాయతీ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో బుధవారం సాయంత్రం గ్రామస్థులు, పోలీసుల మధ్య ఘర్షణ నెలకొంది.

ఓట్ల లెక్కింపులో వివాదం తలెత్తడంతో ఆందోళనకు దిగిన గ్రామస్థులను చెదరగొట్టేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో గ్రామస్థులు పోలీసు వాహనాలపై రాళ్లు రువ్వడంతో రెండు పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఘటనలో ఎస్‌ఐ పురుషోత్తం తలకు గాయాలయ్యాయి.అలాగే గ్రామస్థులను చెదరగొట్టే ప్రయత్నంలో ఓ వ్యక్తి మురికి కాలువలో పడటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని పోలీసులు తెలిపారు.గురువారం ఉదయం కుడా గ్రామంలో పోలీసులు భారీగా మోహరించారు.

# క్షేత్ర స్థాయిపై జనసేన దృష్టి...

ఏలూరు, డిసెంబర్ 18,

జనసేన సంచలన నిర్ణయాలను తీసుకుంటోంది. గతానికి భిన్నంగా వ్యవహరిస్తోంది. క్షేత్రస్థాయి నుంచి బలపడాలని చూస్తోంది. జనసేన ఆవిర్భవించి పుష్కరకాలం అవుతోంది. 2014 ఎన్నికల నాటికి జనసేన ప్రకటన చేశారు పవన్ కళ్యాణ్. అయితే అప్పటికప్పుడు ఎన్నికల్లో పోటీ చేయడం సాహసం అని భావించిన ఆయన రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి, కేంద్రంలో బిజెపికి మద్దతు తెలిపారు. అయితే అలా ఈ పదేళ్లలో తొలుత అపజయాలు, ఆ తరువాత ఇప్పుడు ప్రభుత్వంలో కీలక భాగస్వామ్యం లభించింది. అయితే ఈ మొత్తం పరిణామ క్రమంలో ఆ పార్టీ క్షేత్రస్థాయిలో బలపడే ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు ఆ ప్రయత్నంలో ఉంది జనసేన. వార్డు, గ్రామ, పంచాయితీ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఇప్పటివరకు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేసింది.ప్రస్తుతం జనసేన కార్యదర్శిగా రామ్ తాళ్లూరి ఉన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం గా ఉండగా మరో ఇద్దరు మంత్రులుగా ఉన్నారు. 21 మంది ఎమ్మెల్యేలతో పాటు ఇద్దరు ఎంపీలు, ఎమ్మెల్సీలు సైతం కొనసాగుతున్నారు. అయితే ఇప్పుడు ఉన్నఫలంగా ఉన్న కమిటీలను రద్దు చేసింది జనసేన. మొన్ననే ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. అందుకే ఇప్పుడు ఉన్న కమిటీలను రద్దు చేసినట్లు తెలుస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచి వెంట నడిచిన వారికి ఈ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వనన్నారు. కొత్తవారికి సైతం చోటిచ్చే ఛాన్స్ కనిపిస్తోంది.జనసేన నాయకత్వం పై ఒక విమర్శ ఉండేది. క్షేత్రస్థాయిలో గ్రౌండ్ లెవెల్ నుంచి పార్టీని బలోపేతం చేసే చర్యలు చేపట్టడం లేదన్న అపవాదు ఉండేది. ఎంతవరకు పై స్థాయిలో ముందుకెళ్లడమే తప్ప కిందిస్థాయిలో పట్టించుకోవడంలేదని పవన్ కళ్యాణ్ పై ఎక్కువ మంది ఆవేదనతో ఉండేవారు. కానీ ఇప్పుడు గ్రౌండ్ లెవెల్ నుంచి పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. ప్రతి వార్డుకు ఇన్చార్జి తో పాటు గ్రామ కమిటీలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీలను నియమించడం ద్వారా జనసేనకు స్పష్టమైన బలం ఉంచుకునేలా చూస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో జనసేనకు ఓట్ల పరంగా మెరుగైన శాతం దక్కింది. సీట్ల పరంగా కూడా శతశాతం విజయం దక్కించుకుంది. అందుకే ఈసారి ఓట్లు పెరగాలి.. సీట్లు పెరగాలని ఆలోచన చేసి కమిటీలను ఏర్పాటు చేసినట్లు స్పష్టం అవుతోంది.

టార్గెట్ జగన్ కంటిన్యూ....

పవన్.. ప్రసంగాలతో రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ క్రియేట్ చేసుకున్నారు. జనసేన ఆవిర్భావం నుంచి ఇప్పుడు డిప్యూటీ సీఎం వరకు.. ప్రసంగం ఏదైనా సరే.. ఎప్పుడైనా సరే.. సూటిగా, సుత్తిలేకుండా.. కౌంటర్‌కు ఎన్‌కౌంటర్ అన్నట్లుగా ఆయన మాటలు వినిపిస్తుంటాయ్. ఇప్పుడు కూడా అలానే వినిపిస్తున్నాయ్. ప్రత్యర్థి పార్టీకి కౌంటర్‌లు ఇవ్వడమే కాదు.. కూటమి పార్టీల ఐక్యతపై జరుగుతున్న ప్రచారానికి తన మార్క్ ఆన్సర్లు ఇస్తున్నారు పవన్. వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ మరింత ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు కనిపిస్తున్నారా అంటే.. వరుస పరిణామాలు అవును అనేలా అనిపిస్తున్నాయనే చర్చ జరుగుతోంది. పవన్ ప్రతీ ప్రసంగంలోనూ.. ఆచితూచి మాటలు, స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్.కొత్తగా ఎంపికైన పోలీసు కానిస్టేబుళ్లకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. ఐతే అక్కడ ఆయన మాట్లాడిన మాటలు.. రాజకీయంగానే కాదు.. పరిపాలనా పరంగానూ ఆసక్తి రేపుతున్నాయ్. పోలీసు వ్యవస్థను బెదిరించే ధోరణిని కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని పవన్ అన్నారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు ఎవరిపైనా ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు అధికారులపై జగన్ చేసిన వ్యాఖ్యలను హైలైట్ చేస్తూ.. అలాంటి ప్రకటనలను ప్రభుత్వం నిశితంగా గమనిస్తుందని పవన్ స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులకు ఎలాంటి సమస్య వచ్చినా కూటమి సర్కార్ అండగా ఉంటుందన్న భరోసా ఇచ్చారు. దీంతో ఇప్పుడు కొత్త చర్చ స్టార్ట్ అయింది. అంటే.. జగన్ ప్రతీ మాటను పవన్ సునిశితంగా పరిశీలిస్తున్నారా.. ఎప్పటికప్పుడు కౌంటర్ ఇస్తూ కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తున్నారా అనే చర్చ జరుగుతోంది.జగన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వడమే కాదు.. పవన్ ప్రసంగాన్ని చూసినప్పుడు కొన్ని ఆసక్తికర అంశాలు కనిపిస్తున్నాయ్. సీఎం చంద్రబాబుతో పాటు.. మంత్రి నారా లోకేశ్‌ను కూడా ఈ మధ్య తన ప్రసంగాల్లో ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు పవన్. ప్రభుత్వానికి అన్ని జిల్లాలు ఒక్కటేనని.. ఐతే ముఖ్యమంత్రికి ఎంత ప్రేమ లేకపోతే సత్యసాయి జిల్లాకు పరిశ్రమలు తెచ్చారు.. ఎంత అభిమానం లేకపోతే ప్రకాశం జిల్లాకు ఏఏఓ ప్రాజెక్టు ఇచ్చారంటూ చంద్రబాబు తీరును ప్రశంసించారు. అదే సమయంలో మంత్రి లోకేశ్ ప్రస్తావన తీసుకువచ్చారు. పండుగ వాతావరణంలో నిర్వహించిన వేడుకలో.. లోకేశ్ లేకపోవటం పెద్ద లోటు అంటూ చెప్పుకొచ్చారు. ఇలా ఒక రకంగా కూటమి పార్టీల మధ్య మంచి సఖ్యత ఉంది.. ఒకరికొకరం సహకరించుకుంటున్నాం అనే సంకేతాలను కూడా తన ప్రసంగాల ద్వారా పార్టీ కేడర్‌లోకి పంపుతున్నారు పవన్. మరో పదిహేనేళ్లు కూటమిదే అధికారం అనే మాట విషయంలో ఎంత స్ట్రాంగ్ ఉన్నాననేది కూడా.. తన ప్రసంగాలతో చెప్తున్నారు పవన్.అప్పుడు విపక్ష నేతగా అయినా.. ఇప్పుడు డిప్యూటీ సీఎంగా అయినా.. పవన్ మాటలో వేడి తగ్గలే.. తగ్గేదే లే అని జనసేన కార్యకర్తలు అంటున్నారు. ఇదంతా ఎలా ఉన్నా.. పవన్ కళ్యాణ్ ప్రతి మాటను లెక్కచేసి మాట్లాడుతున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. కూటమిలోని ప్రధాన నేతల మధ్య ఎలాంటి దూరం ఏర్పడకుండా చూసుకోవాలన్న ఆలోచన ఆయన మాటల్లో ప్రతిబింబిస్తోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. అదే సమయంలో ప్రత్యర్థుల వ్యాఖ్యలపై అప్రమత్తంగా ఉండే వ్యూహం కూడా ఈ ప్రసంగంలో కనిపిస్తోందన్న చర్చ కొనసాగుతోంది.

# వాట్సప్ లో టిక్కెట్ల బుకింగ్

విజయవాడ, డిసెంబర్ 18,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు శుభవార్త చెప్పింది! ఇకపై ఏపీఎస్ఆర్టీసీ బస్సు టికెట్లను వాట్సాప్ ద్వారానే సులభంగా బుక్ చేసుకోవచ్చు. 9552300009 నంబర్‌కు 'ఊఎ' అని మెసేజ్ పంపి, ప్రయాణ వివరాలు అందించి, ఆన్‌లైన్‌లో పేమెంట్ చేస్తే చాలు. టికెట్ మీ వాట్సాప్‌కే వస్తుంది. ఈ కొత్త సేవను ప్రయాణికులు ఉపయోగించుకోవాలని ఆర్టీసీ సూచిస్తోంది. ప్రయాణికులు నిమిషాల వ్యవధిలోనే బస టికెట్లను బుక్ చేసుకోవచ్చు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు తీపికబురు చెప్పింది.. ఏపీఎస్ఆర్టీసీ బస్సుల టికెట్లను వాట్సాప్ (మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్) ద్వారా బుక్ చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు ఆర్టీసీ యాప్,



వెబ్‌సైట్, రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకుంటున్నారు.. కానీ ఇకపై వాట్సాప్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు. ప్రయాణికులు వాట్సాప్ ద్వారా చాలా సులభంగా ఈ టికెట్లను బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ ట్వీట్ చేసింది.. ప్రయాణికులు వాట్సాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో టికెట్లను వాట్సాప్ ద్వారా ఎలా బుక్ చేసుకోవాలో చెబుతూ వివరాలు కూడా ప్రస్తావించారు.ప్రయాణికులు 9552300009 నంబర్‌ను సేవ్ చేసుకోవాలి.. అనంతరం ఆ నంబర్‌కు వాట్సాప్‌లో ఊఎ మెసేజ్ పంపాలి. అప్పుడు కొన్ని ఆప్షన్స్ వస్తాయి.. అందులో అప్త్రనీనీబవ రావతీలతిఇవ ను ఎంచుకోవాలి. ంఖూఖీఅ రావతీలతిఇవబ ఆప్షన్‌ను ఎంచుకుని..టిక్కెట్ బుకింగ్ ను ఎంపిక చేసుకుకోవాలి. అక్కడ ప్రయాణానికి సంబంధించిన వివరాలు (ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలో) సమాచారం ఎంటర్ చేయాలి. అనంతరం ఆన్‌లైన్ పేమెంట్ చేస్తే టికెట్ బుక్ అవుతుంది.. అనంతరం వాట్సాప్‌కు టికెట్ మెసేజ్ కూడా వస్తుంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.వాట్సాప్ ద్వారా ఆర్టీసీ బస్ టికెట్లను బుక్ చేసుకోవచ్చని ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు బస్ స్టేషన్లు, రిజర్వేషన్ కౌంటర్లు, ఎంక్వైరీ కౌంటర్లు, బస్ స్టేషన్లతో పాటుగా అవసరమైన చోట స్టిక్కర్లు, బ్యానర్లు ప్రదర్శించనున్నారు. బస్సుల్లో కూడా స్టిక్కర్లు అంటించి వాట్సాప్ నంబర్ 9552300009 (మన మిత్ర) ద్వారా ఆర్టీసీ బస్సు టికెట్లు బుక్ చేసుకోవచ్చని ప్రచారం కల్పించనున్నారు. ఇంగ్లీష్, తెలుగు భాషలలో వాట్సాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సంక్రాంతి సమయం కావడంతో ఎక్కువమంది ప్రయాణికులు వాట్సాప్ ద్వారా బస్ టికెట్లను బుక్ చేసుకునేలా ఆర్టీసీ అవగాహన కల్పిస్తోంది. మొత్తానికి ఆర్టీసీ బస్ టికెట్లు బుక్ చేసుకునే సేవలు కూడా వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చాయి.

==============

# జగన్ ను చుట్టుముట్టిన అగ్రిగోల్డ్ బాధితులు

విజయవాడ, డిసెంబర్ 18,

వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల్లోకి వచ్చేందుకు నిర్ణయించారు. ఇప్పుడిప్పుడే ప్రజల్లోకి వస్తున్నారు కూడా. నిన్ననే విజయవాడలో ఇల్లు కూల్చివేత బాధితులను పరామర్శించారు. రేపు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ను కలవనున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల సేకరణ చేపట్టింది. అలా సేకరించిన సంతకాలను ఏపీ గవర్నర్కు నివేదించనున్నారు జగన్మోహన్ రెడ్డి. అయితే ప్రజా







ఉద్యమాల దిశగా జగన్ అడుగులు వేస్తున్నారు అని అర్థం అవుతోంది. కానీ ఆయనకు మునుపటి మాదిరిగా స్వేచ్ఛ ఉండే పరిస్థితి లేదు. ఎందుకంటే ఆయన ఐదేళ్లు పాలించారు. ప్రజలకు ఎన్నో రకాల హామీలు ఇచ్చారు. అందులో కొన్ని హామీలను మాత్రమే తీర్చగలిగారు. మిగతా వాటి విషయంలో మాత్రం ఇబ్బందికర పరిస్థితులు తప్పవని తెలుస్తోంది. ప్రధానంగా అగ్రిగోల్డ్ సమస్య.2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలుపునకు ప్రధాన కారణం అగ్రిగోల్డ్ బాధితులు. అప్పట్లో లక్షలాది మంది బాధితులు ఉండేవారు. పెద్ద ఎత్తున డిపాజిట్లు కట్టారు. కానీ అగ్రిగోల్డ్ యాజమాన్యం చేతులెత్తేసింది. ఈ క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లింపులు చేస్తామని చెప్పింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కొద్దిపాటి మొత్తాన్ని బాధితులకు అందించి ఐదేళ్లపాటు కాలం గడిపేశారు. పైగా అదే అగ్రిగోల్డ్ భూములను వైసీపీ నేతలు కొనుగోలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిణామాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రిగోల్డ్ బాధితుల విషయంలో మైనస్ అవుతోంది. విజయవాడ తో పాటు పరిసర ప్రాంతాల్లో జగన్ పర్యటిస్తే ఇదే ప్రాధాన్య అంశంగా మారుతోంది.నిన్ననే జగన్మోహన్ రెడ్డి విజయవాడలోపర్యటించారు. ఇల్లు కూల్చివేతకు సంబంధించి బాధితులను పరామర్శించారు. ఆ సమయంలో ఓ మహిళ జగన్మోహన్ రెడ్డి వద్దకు వినతిపత్రంతో వచ్చింది. ఇల్లు కూల్చివేత బాధితురాలు అని భావించి జగన్మోహన్ రెడ్డి ఆమె గోడును తెలుసుకునే ప్రయత్నం చేశారు. అయితే అగ్రిగోల్డ్ బాధితురాలు అని చెప్పడంతో తరువాత చూద్దాంలే అంటూ అక్కడ నుంచి పంపించేశారు. టాపిక్ డైవర్ట్ అవుతుందని చెప్పి ఆమెను పంపించడం విశేషం. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గతంలో ప్రతిపక్షాల విషయంలో ఇలాంటి మైండ్ గేమ్ లే ఆడాయి. అప్పట్లో నేతలు ప్రజాక్షేత్రంలోకి వస్తే ఏవేవో నిలదీత లకు ప్లాన్ చేసేది. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి వస్తుంటే ప్రజలు గతాన్ని తవ్వే అవకాశం ఉంది. అప్పుడు టాపిక్ డైవర్ట్ అంటే కుదిరే పని కాదు. కచ్చితంగా జగన్మోహన్ రెడ్డి విషయంలో ఆయన తమ విషయంలో ఆడిన మైండ్ గేమ్ ను ప్రతిపక్షాలు సైతం ప్రయోగిస్తాయి. అందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉండాల్సిందే.

జగన్ గేర్ మార్చాల్సిందేనా

పార్టీ పెట్టినప్పటి నుంచి అనేక సవాళ్లను ఎదుర్కొని..జైలుకే వెళ్లినా తగ్గకుండా నిలబడిన నాయకుడిగా తమ అధినేతకు ఎలివేషన్ ఇచ్చుకుంటుంటారు ఫ్యాన్ పార్టీ నేతలు. కానీ 2024లో ఓడినప్పటి నుంచి వైసీపీ అధినేత ఫేస్ చేస్తున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఓ వైపు ఘోర ఓటమి..మరోవైపు లీడర్ల అరెస్టులు..ఇంకోవైపు తమ హయాంలో తీసుకున్న నిర్ణయాలపై దర్యాప్తులు..ఇలా అన్నీ చుట్టుముట్టడంతో ఫ్యాన్ పార్టీ క్యాడర్ కాస్త నిరాశ, గందరగోళ పరిస్థితుల్లో ఉంది.నియోజకవర్గాల్లో లీడర్లు యాక్టీవ్‌గా లేకపోవడం ఒక సమస్య అయితే..మాజీ సీఎం జగన్ ప్రజాక్షేత్రంలోకి రాకపోవడంతో ఇప్పటికీ బౌన్స్ బ్యాక్ అవుతామో లేదోనన్న డైలమా వైసీపీ శిబిరంలో కనిపిస్తోందట. మరోవైపు వివేకా హత్య కేసు వెంటాడుతూనే ఉంది. లిక్కర్ స్కామ్ కేసు మధనపెడుతోంది. తిరుమల కల్తీ నెయ్యి ఎపిసోడ్, పరకామణి కేసు ఎప్పుడు ఏ టర్న్ తీసుకుంటుందో ఎవరి మెడకు ఉచ్చు బిగుసుకుంటుందోనన్న టెన్షన్ అయితే వదలట్లేదు.వైసీపీ అంతర్గతగా ఇన్ని సమస్యలు ఫేస్ చేస్తున్న క్రమంలో కూటమి దూకుడు పెంచుతోంది. ప్రత్యేకంగా టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు పార్టీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ప్రభుత్వ పరంగా సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ..ఇంకోవైపు పెద్ద పెద్ద ప్రాజెక్టులను ఏపీకి తెచ్చేందుకు ట్రై చేస్తూ..ప్రజల్లో పాజిటివ్ ఒపీనియన్‌ను క్రియేట్ చేసుకుంటున్నారు.

అటు పార్టీ పరంగా కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షుల నియామకం..పెండింగ్ నామినేటెడ్ పోస్టుల భర్తీ ఇలా అన్నింటిని క్లియర్ చేసి.. రెండేళ్ల పాలన పూర్తయ్యే సరికి ఇంకా స్పీడ్ పెంచాలని డిసైడ్ అయ్యారట. బలమైన ఈక్వేషన్లు..సామాజిక వర్గాలను తమ వెంటే నడిచేలా వ్యూహరచన చేస్తున్నారట. ఇలాంటి సిచ్యువేషన్‌లో అపోజిషన్ వైసీపీ పరిస్థితి ఏంటన్నది చర్చగా మారింది. ఇప్పటికిప్పుడు పార్టీలో మరిన్ని మార్పులు తెస్తారా.? జగన్ తన తీరును ఇంకా మార్చుకుని జనంలోకి వస్తారా.? అనేది ఉత్కంఠ రేపుతోంది.టీడీపీ పరంగా చంద్రబాబు దూకుడు అలా ఉంటే..ఇన్నాళ్లు వైసీపీని పల్లెత్తు మాట అనడానికి కూడా ఇష్టపడని బీజేపీ..అటాక్ మోడ్‌లోకి వెళ్తామంటోంది. ఎన్డీయేకు ఏపీలో కూటమి చాలా ముఖ్యం. రాజకీయంగా వైసీపీ అవసరం అయితే అంతగా ఉండకపోవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే వైసీపీ అధినేత జగన్‌తో బీజేపీ పెద్దలకు ఇంటర్నల్‌గా ఉన్న సన్నిహిత సంబంధాలే ఏపీలో కూటమి పెద్దలను కాస్త కలవరపెట్టాయట. లేటెస్ట్‌గా ప్రధాని మోదీ కామెంట్స్‌తో క్లియర్ కట్ క్లారిటీ వచ్చిందని అంటున్నారు.ఏపీ ఎంపీలతో మోదీ మాట్లాడుతూ వైసీపీని గట్టిగా టార్గెట్ చేయాలని చెప్పినట్లు మాట్లాడుకుంటున్నారు. దీంతో వైసీపీ మీద బీజేపీ జాతీయ నాయకత్వమే దూకుడు పెంచడానికి రెడీగా ఉందన్న సంకేతాలు పంపించారని అంటున్నారు. దాంతో బీజేపీ, వైసీపీ చీకటి దోస్తీ అంటూ నడుస్తున్న ప్రచారానికి చెక్ పెట్టినట్లేనన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పటిదాకా మోదీ వైసీపీని పెద్దగా టార్గెట్ చేయలేదు. కానీ ఇప్పుడునున్న పరిస్థితుల్లో దేశంలో పొలిటికల్ ముఖచిత్రం మారుతోంది.ఏపీలో కూడా బీజేపీకి ఒక క్లారిటీ వచ్చిందని అంటున్నారు. వైసీపీని టార్గెట్ చేయకపోతే బీజేపీని కూటమి పార్టీలు స్ట్రాంగ్‌గా బిలీవ్ చేసే పరిస్థితి ఉండదు. అందుకే ఏపీలో కూటమి పార్టీలకు క్లియర్ కట్ ఇండికేషన్ ఇచ్చేందుకే..వైసీపీ విషయంలో బీజేపీ స్ట్రాంగ్ రియాక్ట్ అవ్వాలని డిసైడ్ అయ్యిందంటున్నారు. ఇప్పటికైనా వైసీపీ అధినేత గేర్ మారుస్తారా.? లేక ఇలాగే వెయిట్ అండ్ సీ లైన్‌లోనే ఉంటారా.? అనేది ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అనంతలో టీడీపీ వర్సెస్ బీజేపీ

అనంతపురం, డిసెంబర్ 18

అనంతపురం జిల్లాలోని రాయదుర్గంలో టీడీపీ, బీజేపీల మధ్య రాజకీయ యుద్ధం జరుగుతుంది. బీజేపీ నేత కాపు రామచంద్రారెడ్డి ముందస్తు వ్యూహంతో వెళుతున్నట్లే కనిపిస్తుంది. బీజేపీలో ఉన్నప్పటికీ ఆయన మనసంతా వైసీపీలో ఉన్నట్లే కనిపిస్తుంది. రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బీజేపీలో చేరారు. అయితే ఆయన వ్యవహారశైలిని చూస్తుంటే బీజేపీలో ఎక్కువ రోజులు ఉండేటట్లు కనిపించడం లేదు. తన మైనింగ్ వ్యవహారాలను కాపాడుకోవడానికే బీజేపీలో చేరారని టీడీపీ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు వంటి వారు విమర్శిస్తున్నారు. ఆయన అక్రమంగా గనులను తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఇటీవల టీడీపీ నేతలు ఆందోళనకు కూడా దిగారు. కానీ కాపు రామచంద్రారెడ్డి మాత్రం వైసీపీలో ఉన్నవారందరికీ బీజేపీ కండువాలను కప్పుతున్నారు.కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గం నియోజకవర్గం నుంచి మూడు సార్లు గెలుపొందారు. 2009లో గెలిచిన కాపు 2012లో జరిగిన ఉపఎన్నికలలో గెలుపొందారు. తిరిగి 2019 లో గెలిచారు. రాయదుర్గం నుంచి గెలుస్తూ వస్తున్న కాపు రామచంద్రారెడ్డికి గత ఎన్నికల్ల వైఎస్ జగన్ టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో కాపు రామచంద్రారెడ్డి బీజేపీలో చేరారు. కానీ బీజేపీలో చేరినప్పటికీ అక్కడ కూటమి నేతలకు మధ్య పొసగడం లేదు. టీడీపీ వర్సెస్ బీజేపీగా రాయదుర్గం నియోజకవర్గంలో నడుస్తుంది. వైసీపీ ఇక్కడ కొంత సైలెంట్ గా ఉన్నప్పటికీ ప్రధానంగా బీజేపీ, టీడీపీ ల మధ్య వైరం కొనసాగుతున్నట్లు కనిపిస్తుంది. కాల్వ శ్రీనివాసులు, కాపు రామచంద్రారెడ్డి లు గత కొన్ని ఎన్నికల్లో వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేయడంతో కూటమి పార్టీలో ఉన్న సయోధ్య కుదరలేదు.ఇక్కడ కూటమి తరుపున ఏ కార్యక్రమం జరిగినప్పటికీ టీడీపీ, బీజేపీ లు ఎడమొఖం,పెడముఖంలానే ఉన్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల్లో టీడీపీ నేతలతో పాటు బీజేపీ నేతలు పాల్గొనడం లేదు. అయితే కాపు రామచంద్రారెడ్డి కేవలం తన గనుల తవ్వకాల కోసమే తాత్కాలికంగా బీజేపీ పంచన చేరారని, ఎన్నికలకు ముందు తిరిగి వైసీపీలోకి వెళ్లడం ఖాయమని టీడీపీ నేతలు చెబుతున్నారు. అటువంటి నేతకు ఎందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని కొందరు టీడీపీ నేతలు బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినా బీజేపీ నేతలు మాత్రం పట్టించుకోకపోవడంతో రాయదుర్గం నియోజకవర్గంలో టీడీపీ వర్సెస్ బీజేపీ అన్న రీతిలోనే కార్యక్రమాలు సాగుతున్నాయి. బీజేపీ నేత కాపు రామచంద్రారెడ్డి కి వ్యతిరేకంగా టీడీపీ నేతలు నిరసన ప్రదర్శనలు కూడా చేస్తుండం రాయదుర్గం నియోజకవర్గం ప్రత్యేకత.

# గాంధీభవన్ వద్ద భారీగా పోలీసుల మోహరింపు.. ఉద్రిక్తత

హైదరాబాద్: నగరంలోని గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌ను ఈడీ కేసులతో వేధిస్తున్నారని పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

# ఇచ్ఛాపురంలో కొత్త నేత కావలెను..

శ్రీకాకుళం, డిసెంబర్ 18, (

ఏపీ రాజకీయాల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. గేట్ వే ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే కాదు.. ఇది పాదయాత్రలకు పెట్టింది పేరు. ఏ నేత పాదయాత్రలు స్టార్ట్ చేసినా.. ఇక్కడి నుంచే.. ఇక్కడితో షెడ్యూల్ చేసుకుంటారు. దీంతో పొలిటికల్ సర్కిల్స్‌లో ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎప్పుడూ హాట్‌టాపిక్‌గానే ఉంటుంది. నిజానికి ఇచ్ఛాపురంలో వైసీపీకి ఎప్పుడూ ఎదురుదెబ్బలే తగులుతున్నాయ్. గత మూడు సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇక్కడ విజయం సాధించలేకపోయింది. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా.. అక్కడ ఫ్యాన్ పార్టీ జెండా ఎగరడం లేదు. ఐతే వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రికార్డును బ్రేక్ చేయాలని.. ఇచ్ఛాపురం అడ్డాలో పార్టీ జెండా ఎగురవేయాలని వైసీపీ ఫిక్స్ అయింది. దీనికోసం ఎలాంటి మార్పులకైనా, రిపేర్లకైనా సిద్ధంగా కనిపిస్తోంది.ఇచ్ఛాపురం నుంచి టీడీపీ నుంచి బెందాళం అశోక్ కుమార్.. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి.. ఇచ్ఛాపురం నియోజకవర్గం టీడీపీకి కంచుకోటలా ఉంది. అంతకుముందు.. కాంగ్రెస్సేతర అభ్యర్థులే అక్కడ విజయం సాధించారు. ఐతే వైసీపీ ఆవిర్భావం తర్వాత.. కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ఆ పార్టీకి మారింది. టీడీపీ ఓటు బ్యాంక్ మాత్రం చెక్కు చెదరలేదు. 2014 ఎన్నికల్లో ఇచ్ఛాపురంలో వైసీపీ తరపున నర్తు రామారావు బరిలో దిగి ఓడిపోయారు. దీంతో 2019 ఎన్నికల్లో పిరియా సాయిరాజ్‌ను పోటీకి దింపింది వైసీపీ. ఆయన కూడా 7వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. దీంతో 2024 ఎన్నికల ముందు.. సాయిరాజ్‌ను సమన్వయకర్తగా తప్పించిన వైసీపీ.. ఆ బాధ్యతలను ఆయన సతీమణి పిరియా విజయకు అప్పజెప్పింది. అయినా వైసీపీకి నిరాశే మిగిలింది. 2024 ఎన్నికల్లో 39వేలకు పైగా ఓట్ల తేడాతో పిరియ విజయ ఓడిపోయారు. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విజయం సాధించాలని పట్టుదలతో కనిపిస్తున్న వైసీపీ.. కొత్త అభ్యర్థిని బరిలోకి దింపాలని భావిస్తోంది. దీనికోసం క్షేత్రస్థాయిలో కసరత్తులు కూడా మొదలుపెట్టిందని టాక్.సామాజికవర్గాల వారీగా అన్ని రకాల లెక్కలు పక్కాగా అమలు చేసినా.. వైసీపీకి గత ఎన్నికల్లో కలిసి రాలేదు. జనాభాపరంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రెడ్డిక సామాజికవర్గంతో పాటు.. యాదవ, కాళింగ, అగ్ని కుల క్షత్రియ వర్గాల ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వైసీపీ హయాంలో యాదవ సామాజికవర్గానికి చెందిన నర్తు రామారావుకి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టిన జగన్.. ఆ వర్గానికి అండగా నిలిచారు. ఇక కాళింగ సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సతీమణి విజయమ్మకి.. బీసీ కోటా జడ్పీ చైర్‌పర్సన్‌గా చాన్స్ అచ్చారు. పైగా గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించారు. ఇక రెడ్డి సామాజికవర్గానికి చెందిన శ్యామ్ ప్రసాద్ రెడ్డిని.. సిడాప్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఇలా అన్ని సామాజికవర్గాలకు జగన్ అవకాశం ఇచ్చినా.. నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో.. ఇచ్ఛాపురంలో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది.వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురంలో విజయం కోసం వైసీపీ పక్కాగా వ్యూహాలు అమలు చేస్తోంది.

నేతల మధ్య కోఆర్డినేషన్ లేకపోవడమే.. ఓటమికి కారణంగా వైసీపీ అధిష్టానం గుర్తించిందని తెలుస్తోంది. దీంతో ఇంచార్జిని మార్చే ఆలోచనలో ఉందట. పార్టీ వర్గాలు సహకరించడం లేదని పిరియా సాయిరాజు దంపతులు.. వైసీపీ బాస్ దగ్గర మొర పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఇచ్ఛాపురం పార్టీకి ట్రీట్‌మెంట్ మొదలుపెట్టిన జగన్.. నియోజకవర్గ నేతలతో సంప్రదింపులు మొదలుపెట్టారని తెలుస్తోంది. కొత్త నేత కోసం వేట మొదలుపెట్టారని టాక్. సామాజిక సమీకరణాలుతో పాటు అంగబలం, అర్థబలం ఉన్న నేతలు కోసం సెర్చ్ చేస్తున్నారు. ఇప్పటికే అనేకమంది నేతలు.. అధిష్టానం ముందు తమకి నియోజకవర్గ బాధ్యతలు ఇవ్వాలని అర్జీలు పెట్టుకుంటున్నారని తెలుస్తోంది. మరి అధినేత ఎవరి వైపు మొగ్గు చూపుతారో చూడాలి.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ website :

**Tender Notice No.:CEE/P/SC-25kv-EPC-PSI-BZA-OGL-05, Dated : 16-12-2025** PUB/1608

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్ వారు ఈ క్రింది పనులకు (ఆన్‌లైన్) ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్రమ సంఖ్య: 01 టెండర్ నెం.: పని వివరణ: 2x25kv, తేదీ:15.12.2025 : విజయవాడ డివిజన్‌లోని విజయవాడ (BZA)-ONGOLE (OGL) విభాగంలో SCOTT- కనెక్టెడ్ ట్రాన్స్‌ఫార్మర్‌లతో 2x25kv AT వ్యవస్థలో ట్రాక్షన్ సబ్-స్టేషన్లు (TSCలు), సెక్షనింగ్ పోస్ట్‌లు (SPలు) మరియు సబ్-సెక్షనింగ్ మరియు పారలలింగ్ పోస్ట్‌లు (SSPలు) డిజైన్, సరఫరా, నిర్మాణం, పరీక్ష మరియు కమీషనింగ్. అంచనా వ్యయం : రూ.180,24,00,000.00 EMD ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి: రూ.91,62,000.00/ - టెండర్ ఫారం ధర రూ,లో లేదు. పూర్తిచేయు కాలం : 24 నెలలు (ఇరవై నాలుగు నెలలు). టెండర్ ప్రారంభ స్థలం : సికింద్రాబాద్

వరుస సంఖ్య : 1. వివరణ : ముగింపు ఈ టెండర్ (ఆన్‌లైన్) ద్వారా టెండర్. సమయం : 15.00 గంటలు. తేదీ : 18.02.2026

వరుస సంఖ్య : 2. వివరణ : ప్రారంభం ఈ టెండర్ (ఆన్‌లైన్) ద్వారా టెండర్ యొక్క సమయం: 15.30గంటలు. తేదీ: 23.02.2026

టెండర్లు, ఏవైనా మార్పులు, సవరణలు, అనుబంధధాల సమర్పణ కోసం దయచేసి, మా వెబ్‌సైట్ www.ireps.gov.inని సందర్శించండి.

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ ప్రాజెక్ట్స్ / సికింద్రాబాద్

**Open e-Tender Notice Nos.: C/E.29/Elec/M/SC/32/WS-Deposit/OT/2025-26, Dated : 16-12-2025** PUB/1609

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన తరపున క్రింది ఇవ్వబడిన పని కోసం 09.01.2026న మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్రమ సంఖ్య : 1, ఇ-టెండర్ నెం.: ఎటెండర్ నం.: C/E.29/Elec/M/SC/32/WS-Deposit/OT/2025-26, ఈ-టెండర్ నెం. E-M-SC-32-OT-2025-26. పని పేరు : సికింద్రాబాద్ డివిజన్ ఎలక్ట్రికల్ నిర్వహణ విభాగం : (i) SNF ఫ్రైట్ డిపోలో - సరకు రవాణా వ్యాగన్ నిర్వహణ మౌలిక సదుపాయాల పెంపుదల (ii) హైదరాబాద్- TS/HYB వద్ద ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల కోసం అదనపు ట్రిప్ ఇన్‌స్పెక్షన్ సౌకర్యాల సృష్టి. (iii) KZJ ఫ్రైట్ డిపో : ఆగ్మెంటేషన్/వ్యాగన్ నిర్వహణ మౌలిక సదుపాయాల పెంపుదల. (iv) DLS-కాజీపే-కాజీపేటలోని డీజిల్ లోకోషెడ్‌లో ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల హోమింగ్ కోసం డీజిల్ షెడ్‌లలో సౌకర్యాల పెంపుదల. (v) DSL/KZJ డిపో స్టోర్‌ల పునరుద్ధరణ మరియు డీజిల్ స్టోర్‌ల పునరుద్ధరణ మరియు డీజిల్ స్టోర్‌ల వద్ద కొత్త కార్యాలయ భవనం నిర్మాణం. (vi) గగులగూడెం సమీపంలోని 4 సంఖ్యల మానవరహిత LCల ప్రస్తుత KTPS సైడింగ్ మరియు నిర్వహణలో మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు అప్‌గ్రేడ్ పలోంచ విద్యుత్ ఏర్పాట్లు. అంచనా వ్యయం : రూ. 2,27,61,086.90. ఇఎండి మనీ డిపాజిట్ :రూ. 2,63,800.00. టెండర్ ఫారం ధర : (రూ)0.00, పూర్తిచేయు కాలం : 6 నెలలు (ఆరు)

1. టెండర్ షరతులు/ఇతర వివరాలు టెండర్ డాక్యుమెంట్లు క్రింది IREPS వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే www.ireps.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేయవచ్చు, పాల్గొనవచ్చు మరియు ఏవైనా సవరణలు ఉంటే వీక్షించవచ్చు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (ఎం), సికింద్రాబాద్

**Tender Notice No.:19-Mech-VB-UPH-T-R-25-26, Dated : 16-12-2025** PUB/1610

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన తరపున తిరుపతిలోని డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, ముగింపు తేదీ కింద ఇక్కడ పేర్కొన్న టెండర్ నెంబర్ : క్రింద పేర్కొన్న విధంగా 11.00 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. బిడ్డర్లు తమ అసలు / సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్‌లు అనుమతించబడవు మరియు అటువంటి మాన్యువల్ ఆఫర్‌లు స్వీకరించబడిన ఏవైనా విస్మరించబడతాయి.

క్రమ సంఖ్య: 01. పని వివరణ: టెండర్ నోటీసు నెం. 19-Mech- VB-UPH-T-R-25-26, తేదీ:16.12.2025 : తిరుపతిలోని క్యారేజ్ రిపేర్ షాపులో " VBట్రైన్ 18 కోచ్‌లలో అప్హోల్స్టరీ సరఫరా & భర్తీ". అంచనా వ్యయం :రూ.1,94,78,212.80 EMD : రూ.2,47,400.00 పూర్తిచేయు కాలం : 03 నెలలు (మూడు నెలలు) ముగింపు తేదీ, సమయం : 30.12.2025, 11.00 గంటలు

వెబ్‌సైట్ వివరాలు : www.ireps.gov.in

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం (టెండర్ పత్రాలలో అందుబాటులో ఉంది) మరియు టెండర్ పత్రాలు, కొరిజెండమ్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి మా వెబ్‌సైట్ www.ireps.gov.in ను సందర్శించండి.

చీఫ్ మెకానికల్ ఇంజనీర్/ సిఆర్ఎస్ / తిరుపతి

**TENDER NOTICE** PUB/1611

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, హైదరాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ ఈ క్రింది పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా తేదీ. 16.01.2026, 11.30 గంటల వరకు ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ తేదీ : 15.12.2025

క్రమ సంఖ్య : 1. టెండర్ నెం : ... పని పేరు : హైదరాబాద్ డివిజన్ (1) సికింద్రాబాద్ థోన్ సెక్షన్ : ఫలక్‌నుమా-రోడ్ నంబర్ 5 & 6ను పూర్తి పొడవు డెడ్-ఎండ్‌స్పర్‌గా మార్చడం, (2) ఫలక్‌నుమా - ప్రస్తుత రోడ్ నంబర్ 6 & 7ను ఆర్ & డి లైన్‌గా మార్చడం మరియు ఒక డెడ్-ఎండ్‌స్పర్ ఏర్పాటు (3) ఇంటర్‌లాక్ చేయబడిన ఎల్‌సి గేట్ స్థానాల వద్ద లోపభూయిష్ట సిగ్నల్ కేబుల్‌ల మరమ్మత్తులు /-సిగ్నల్ మరియు టెలికాం ఏర్పాట్లు. అంచనా వ్యయం (రూ) : 4,12,05,519.15, ఇఎండి (రూ): 3,56,000.00

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, హైదరాబాద్

A2038

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి

# తగ్గని బంగారం జోరు...

ముంబై, డిసెంబర్ 18,

రెండ్రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ పుంజుకొని ఆల్ టైం రికార్డ్ స్థాయి వద్ద కొనసాగుతున్నాయి.



నిన్న ఒక్కరోజే భారీగా తులం బంగారంపై రూ.650 పెరగ్గా.. ఇవాళ మళ్లీ అదే సీన్ రిపీట్ అయింది. బుధవారం నుంచి గురువారం మధ్య కూడా బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. దీంతో డిసెంబర్ 18 గురువారం ఉదయం ఆరు గంటలకు మార్కెల్‌తో 24 క్యారెట్ల తులం బంగారం రూ. 1,34,520 వద్ద కొనసాగుతుంది. బుధవారం ఉదయం రూ.650 పెరిగిన తర్వాత రూ. 1,34,510 గా ఉన్న తులం బంగారం ధర ఇవాళ ఉదయానికి తులంపై రూ. 10 పెరిగి ప్రస్తుతం రూ. 1,34,520 కొనసాగుతుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతుంది.

ఇక బంగారం బాటలోనే వెండి కూడా నడుస్తోంది. నిన్న ఒక్క రోజే ఏకంగా కేజీ బంగారంపై రూ.11 వేలు పెరగ్గా.. బుధవారం నుంచి గురువారం మధ్యలో కాస్త స్వలంగా పెరిగి హోల్ టైం హైకి చేరుకున్నాయి. దీంతో దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.2,08,100గా కొనసాగుతుంది. కాబట్టి దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,670 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,460 వద్ద కొనసాగుతోంది.

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,520 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతోంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,520 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతోంది.

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,520 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతోంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,35,290 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,24,010 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,520 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,23,310 వద్ద కొనసాగుతోంది.

ఈ బంగారం ధరలు ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం డాలర్ విలువ పడిపోవడమని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే డాలర్ విలువ అనేది విలువైన బంగారం, వెండి వంటి లోహాలను ప్రభావితం చేస్తుందట. ఈ కారణంగా బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు ఏర్పడుతాయి. కాబట్టి మీరు బంగారం కొనే ముందు ధరలను తెలుసుకోండి.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ సర్వేయర్

చిత్తూరు డిసెంబర్ 18,

పుంగనూరు తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ. 20 వేలు లంచం తీసుకుంటూండగా ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా విలేజ్ సర్వేయర్ శ్రీరాములు పట్టుబడ్డాడు. మంగళం పంచాయతీలో 8గుంటల భూమి సర్వే కొరకు దరఖాస్తు చేసుకున్న ఉమాశంకర్, 15 రోజుల క్రితం మంగళం సచివాలంలో సర్వే కొరకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.50 వేలు ఒప్పందం కుదుర్చుకుని రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ కి పట్టుబడ్డాడు...

# ఇక సర్కారీ మెట్రో..

హైదరాబాద్, డిసెంబర్ 18,

హైదరాబాద్‌లో మెట్రో రైలు సేవలను విస్తరించడంలో భాగంగా మొదటి దశ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో కీలక చర్చలు జరిపారు మెట్రో



రైలు ఫేజ్ 1లో తమకున్న మొత్తం వాటాను రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో హోల్ సెల్ ఇండియా హైదరాబాద్ దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు ఎల్ అండ్ టికి మెట్రోపై ప్రస్తుతం ఉన్న దాదాపు రూ. 13,000 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించనుంది. దీంతో పాటు తమ కంపెనీ ఈక్విటీ విలువకు సుమారు రూ. రూ.2,000 కోట్లు వన్-టైం చెల్లింపులను చేపట్టాలని ఎల్ అండ్ టి కంపెనీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ చెల్లింపు పూర్తి చేసిన వెంటనే మెట్రో మొదటి దశ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి వస్తుంది. 2014లో దేశంలో మెట్రో రైలు నెట్‌వర్క్‌లో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్, ప్రస్తుతం తొమ్మిదవ స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ రద్దీ, ప్రజా రవాణా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఫేజ్ 2ఎ, 2బి విస్తరణలో భాగంగా ఎనిమిది కొత్త మెట్రో లైన్ల ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. దాదాపు 163 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన మెట్రో విస్తరణ ప్రతిపాదనలన్నీ కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే పలు మార్లు సమావేశాలు నిర్వహించిన కేంద్రం ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తున్న ఫేజ్ 1 మెట్రోకు, ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఫేజ్ 2 విస్తరణకు సంయుక్త కార్యాచరణ అవసరమని సూచించింది. అందుకు వీలుగా ఒప్పందం కావాలని కేంద్రం స్పష్టం చేసింది. ఫేజ్ 2లో కూడా ఎల్ అండ్ టి భాగస్వామ్యం ఉండాల్సి ఉంటుందని కేంద్రం సూచించింది. కేంద్రం అభ్యంతరాల నేపథ్యంలో నెలకొన్న ప్రతిష్టంభనను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, మెట్రో ఫేజ్ 2లోనూ ఎల్ అండ్ టి భాగస్వామ్యం పంచుకుంటే బాగుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగినంత ప్రాధాన్యతనిస్తుందని సిఎం తెలిపారు. ఫేజ్ 1, ఫేజ్ 2 కారిడార్ల మధ్య సంయుక్త కార్యాచరణకు కచ్చితమైన ఒప్పందం అవసరమని ముఖ్యమంత్రి సూచించారు. ఈ ఒప్పందం కుదిరితేనే విస్తరించే రైలు కార్యకలాపాలు సజావుగా సాగుతాయని, ఆదాయ వ్యయాల భాగస్వామ్యంలో స్పష్టత ఉంటుందని సిఎం అన్నారు. రవాణా సంబంధిత వ్యాపారం నుంచి కంపెనీ తప్పుకున్నందు వల్ల కంపెనీ ఈక్విటీ భాగస్వామిగా ఉండలేదని ఎల్ అండ్ టి సీఎండీ అన్నారు. 2002 జులై 22న కుదిరిన రాయితీ ఒప్పందం ప్రకారం ప్రభుత్వం అంగీకరించిన రూ. 3,000 కోట్ల వడ్డీ లేని రుణంలో రూ.2,100 కోట్లు బకాయి ఉందని ఆయన గుర్తు చేశారు. చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్ 1 మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో మెట్రో రెండో దశ విస్తరణ వేగవంతమవుతుందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, ఆమోదం తొందరగా వచ్చే అవకాశముందని సిఎం రేవంత్ అభిప్రాయపడ్డారు

# పంచాయితీ విన్నర్ కాంగ్రెస్

హైదరాబాద్, డిసెంబర్ 18

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజేతగా నిలిచింది. 12వేలకుపైగా పంచాయతీల్లో సర్పంచ్ పదవులు, వార్డు సభ్యుల పదవుల కోసం ఎన్నికలు జరిగాయి. అనేక సవాళ్ల మధ్య కాంగ్రెస్ పార్టీ భారీ విజయాలు సాధించింది. 55 శాతం వరకూ పంచాయతీల్లో అంటే దాదాపుగా 7వేలకుపైగా పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు విజయం సాధించారు. మరో ఆరేడు వందల పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ రెబల్స్ గెలిచారు. వారంతా కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ అనుకోవచ్చు. బీఆర్ఎస్ పార్టీ..కాంగ్రెస్ సాధించిన పంచాయతీల్లో సగం సాధించింది. బీజేపీ మరీ తీసికట్టుగా ఏమీ లేదు. పర్వాలేదనుకునే స్థాయిలోనే పంచాయతీలను సాధించింది. అంతిమంగా కాంగ్రెస్ పార్టీ విన్నర్ గా నిలిచింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో వచ్చిన విజయంతో ధైర్యం తెచ్చుకున్న కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికలను వెంటనే నిర్వహించేసింది. బీసీ రిజర్వేషన్ల అంశం పెద్దగా ఎన్నికల్లో టాపిక్ కాకుండా ఎన్నికలు జరిపించేసింది. నిజానికి స్థానిక ఎన్నికలు బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే నిర్వహిస్తామని గతంలో వాగ్దానాలు చేశారు. అలాంటి అవకాశం లేదని తేలడంతో కోర్టుకు ఇచ్చిన మాట ప్రకారం పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. భారీగా అధికార వ్యతిరేకత ఉందని జరిగిన ప్రచారం మాత్రమే కాదు.. యూరియా సమస్య సహా చాలా అంశాలు కాంగ్రెస్ కు ఇబ్బందికరంగా మారాయి. పొరపాటున గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎక్కువ పంచాయతీలు సాధిస్తే అది భవిష్యత్ లో చాలా ఇబ్బందికరం అయ్యేది . కానీ కాంగ్రెస్ ఆ గండాన్ని గట్టెక్కింది. భారత రాష్ట్ర సమితి క్యాడర్ చేతులు ఎత్తేయకపోవడం ఆ పార్టీ పెద్దల్ని సంతృప్తి పరిచిందని అనుకోవాలి. అధికారంలో లేకపోతే పనులు చేయించుకోలేమన్న కారణం చెప్పి బలమైన గ్రామ స్థాయి నేతలంతా పార్టీ మారిపోయి ఉంటే బీఆర్ఎస్ పార్టీ పరువు పోయేది. కానీ మెజార్టీ నేతలు పార్టీ మారలేదు. గ్రామాల్లో రెండు వర్గాలు బలంగా ఉండటం దీనికి కారణం. ఇలాంటి పరిస్థితితో బీఆర్ఎస్ మద్దతుదారులు గట్టిగా పోరాడారు. బలమైన నేతలు ఉన్న చోట.. బీఆర్ఎస్ నేతలు తమ సర్పంచ్ అభ్యర్థులకు ఆర్థికంగా కూడా సాయం అందించారు. ఇది కలసి వచ్చింది. ఎలా చూసినా.. భారత రాష్ట్ర సమితి జావ



కారిపోలేదు. గట్టిగానే పోరాడి నిలబడింది. ఇది రాబోయే రోజుల్లో పోరాటానికి సరిపోతుంది. గ్రామ స్థాయిలో ఎప్పుడూ బలంగా లేని బీజేపీ ఈ సారి కొన్ని జిల్లాల్లో మంచి ఫలితాలు చూపించింది. బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి ఉన్న నిర్మల్ జిల్లాలో ఇతర పార్టీల కన్నా ఎక్కువ సీట్లు సాధించింది. అలాగే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ వంటి చోట్ల ఏకపక్షంగా కాకపోయినా కొన్ని మంచి ఫలితాలు సాధించారు. ఐదారు వందల పంచాయతీల్లో బీజేపీ మద్దతుదారులు అయిన సర్పంచ్‌ల విజయం సాధించారంటే చిన్న విషయం కాదు. కానీ బీజేపీ ఇచ్చుకున్న హైప్‌కు.. ఆ తర్వాత వచ్చిన ఫలితాలకు మాత్రం పొంతన లేదు. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయిలోనూ విజేతగా నిలిచింది. రెండేళ్ల పాలన తర్వాత జరిగిన ఈ ఎన్నికలు ఆ పార్టీ నాయకత్వానికి మోరల్ సపోర్టుగా ఉంటాయి. రేవంత్ రెడ్డి స్థానానికి మరింత బలం చేకూర్చాయి.


### విజయం వెనుక వ్యూహం- సీఎం ఇమేజ్, సమన్వయం

పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘన విజయానికి కేవలం ప్రభుత్వ పాలన మాత్రమే కారణం కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత ఇమేజ్ కూడా దోహదపడిందని గాంధీ భవన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సీఎం నాయకత్వానికి తోడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య ఉన్న పటిష్టమైన సమన్వయమే ఈ మంచి ఫలితాలను సాధించి పెట్టిందని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రి పరిపాలన విధానానికి పల్లె ప్రాంతాల ప్రజలు పట్టం కట్టిన విషయం ఈ ఫలితాల ద్వారా స్పష్టమవుతోందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామీణ ప్రాంతాల్లో అధికారాన్ని కెలుచుకోవడానికి ప్రధానంగా సంక్షేమ పథకాలే బానటగా నిలిచాయని అభిప్రాయం బలంగా పార్టీలో వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, పేద ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చే పథకాలను అమలు చేయడం ప్రజలను కాంగ్రెస్ వైపు మొగ్గు చూపించింది. ముఖ్యంగా పేదలకు సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి ప్రతిష్టాత్మక పథకాలు, వీటితోపాటు రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా, సన్న ధాన్యానికి ఐదు వందల రూపాయల బోనస్ వంటి వ్యవసాయ అనుకూల విధానాలు అలాగే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా ఓటర్లను ప్రభావితం చేశాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ పథకాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగి, పంచాయతీల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయని అంటున్నారు. ఒకట్రెండు జిల్లాల్లో మినహా రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ ఆధిక్యం సాధించడం ద్వారా కాంగ్రెస్ తన పట్టును బలంగా రుజువు చేసుకుంది. ఈ విజయం పల్లె ప్రాంతాల్లో కాంగ్రెస్ గట్టిగా పాగా వేయగలిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు చేసింది. ఆ రెండు పార్టీలు కలిసినప్పటికీ 30 శాతం సీట్లు దక్కలేదని ఇది ప్రతిపక్షాలపై ప్రజలకు విశ్వాసం లేదని చెప్పడానికి నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు విశ్లేషిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థులపై కాంగ్రెస్ తన విశ్లేషణ వినిపిస్తోంది. స్వతంత్రంగా గెలిచిన వారిలో 90 శాతం మంది కాంగ్రెస్ పార్టీ వాళ్లేనని అంటోంది. రెండు వేలకుపైగా గ్రామాల్లో రెబెల్స్ పోటీ చేశారని, గ్రామీణ ప్రాంతాల్లో వారికి ఉన్న ప్రజాదరణకు ఇదే నిదర్శనమని అంటున్నారు. ప్రస్తుతం గెలిచిన ఈ స్వతంత్రుల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ గూటికి వస్తారని చెబుతోంది. వారి రాకతో 75 శాతానికిపైగా పంచాయతీలు తమ పార్టీవే అవుతాయని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు చేస్తున్న కృషి, అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా మంత్రివర్గం పని చేస్తుండటం కూడా ఈ విజయానికి కారణాలని టీపీసీసీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

# ఇక రయ్ రయ్..టోల్‌గేట్లు ఉండవ్..

ముంబై, డిసెంబర్ 18,

వాహనదారులకు ఇది గుడ్ న్యూస్. ఇక మీరు వాహనంపై వెళ్లేటప్పుడు టోల్ గేట్ల దగ్గర ఆగాల్సిన అవసరం లేదు. ఇక రయ్ రయ్ అంటూ నాన్ స్టాప్‌గా దూసుకెళ్లిపోవచ్చు. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ సిస్టమ్ ద్వారా కూడా నగదు అవసరం లేకుండా డైరెక్ట్‌గా టోల్ ఫీజు చెల్లించే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీని వల్ల టోల్ గేట్ వద్ద వేచిచూసే సమయం భారీగా తగ్గింది. అయినా పండుగల రద్దీ సమయంలో వాహనదారులు ఎక్కువగా ఉంటారు. ఇలాంటి సమయంలో ఫాస్టాగ్ స్కానర్ ద్వారా పేమెంట్ ప్రక్రియ పూర్తి చేసుకుని వెళ్లాలంటే ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. ఇప్పుడు దీనికి కూడా చెక్ పడింది. ఇక మీరు టోల్ గేట్ల దగ్గర ఒక్క నిమిషం కూడా ఆగాల్సిన అవసరం ఉండదు. ఫాస్టాగ్ ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ ఆధారిత మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో టోల్ కలెక్షన్ సిస్టమ్ త్వరలో రాబోతుంది. ఈ సిస్టమ్ ద్వారా టోల్ గేట్ దగ్గర ఆగాల్సిన అవసరం ఉండదు. రోడ్లపై కొన్ని చోట్ల కెమెరాలతో కూడిన ప్రత్యేక స్ట్రక్చర్లు ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాలు నెంబర్ ప్లేట్లను స్కాన్ చేసి ఆటోమేటిక్‌గా టోల్ కట్ అయ్యేలా చేస్తాయి. దీని వల్ల మీరు ఒక్క నిమిషం కూడా ఎక్కడా ఆగే పని ఉండదు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 11 టోల్ ప్లాజాల్లో ఈ తరహాలో పేమెంట్స్‌ను స్వీకరిస్తున్నారు. త్వరలో దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చే అవకాశముంది. ఆటోమేటిక్ పేమెంట్స్ స్వీకరించే కాంట్రాక్ట్‌ను పలు టోల్ ప్లాజాల వద్ద జియో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ మేరకు ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. డెడికేటెడ్ షార్ట్-రేంజ్ కమ్యూనికేషన్‌తో పాటు డియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ టెక్నాలజీలతో కలిసి ఈ కొత్త టోల్



వ్యవస్థ పనిచేస్తుంది. రానున్న రోజుల్లో ఈ కొత్త టోల్ వ్యవస్థ దేశవ్యాప్తంగా అమల్లోకి రానుందని తెలుస్తోంది. దీని వల్ల వాహనదారులకు సమయం ఆదా కానుంది.

# ఢిల్లీలో ఇక ఆక్స్ లే ప్యూరిఫైడ్ వాటర్

న్యూ ఢిల్లీ డిసెంబర్ 18 : హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో అత్యంత పేరు గాంచిన ఆక్స్ లే ప్యూరిఫైడ్ వాటర్ కంపెనీ ఇప్పుడు ఢిల్లీలో కూడా తన అమ్మ కాలను ప్రారంభించబోతుంది. సుమారు 13 సంవత్సరాలుగా తెలంగాణలోని ప్రముఖ నగరాలు, పట్టణాల్లో "అక్స్ లే" తన అమ్మకాలను చేస్తుంది. ఇక తాజాగా ఢిల్లీలో కూడా ఆక్వా ఫీన్ కంపెనీ ఆధ్వర్యంలో తయారు అయ్యే "అక్స్ లే" వాటర్ బాటిల్స్ ను విక్రయించేందుకు ఢిల్లీకి చెందిన ఫ్యూచర్ ఇండియా బివరేజెస్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ఆక్వా ఫీన్ కంపెనీ ఎం.డి ఎన్.వి.రావు, ఫ్యూచర్ ఇండియా బివరేజెస్ కంపెనీ ఎం.డి మనిదీప్ సింగ్ ల మధ్య మంగళవారం ఢిల్లీలో జరిగింది. దీనితో తెలంగాణలో అత్యంత ప్రాచుర్యం పొందిన సంస్థ అక్స్ లే వాటర్ ఇక నుంచి ఢిల్లీ నగర వీధుల్లో కూడా ప్రజలు అందుబాటులో ఉండనుందని అక్స్ లే కంపెనీ ఎం.డి ఎన్.వి రావు తెలిపారు. తన వ్యాపార విస్తరణలో భాగంగా ఆక్వా ఫీన్ కంపెనీ ఎం.డి ఎన్.వి రావు ఢిల్లీకి వెళ్లి ఈ ఒప్పందాన్ని చేసుకున్నారు.

# కమలంలో లీక్ వీరులు ఎవరు

హైదరాబాద్, డిసెంబర్ 18 (

"మోదీతో విందులో జరిగిన చర్చల్ని బయటపెట్టిన వారెవరు?. మోదీ బయటకు చెప్పవద్దనిచెప్పారు?. బయటకు చెప్పిన వారిపై చర్యలు తీసుకుంటాం"..అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియా చిట్ చాట్ లో ఆవేశపడ్డారు. ఆయన అలా అన్నారు కానీ ఆ సమావేశంలో మోదీ ఏం చెప్పారో ఆయన కూడా ఈ మీడియా చిట్ చాట్ లో చెప్పారు. ఒడిషాలో బలమైన నేతలు లేరు కానీ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు. తెలంగాణలో అలా కలసి కట్టుగా ప్రయత్నించాలని చెప్పారు. కానీ తెలంగాణ నేతలు ఏం చేస్తున్నారు?. చివరికి మోదీతో సమావేశం వివరాలు లీక్ అయ్యాయని అంతర్గత రాజకీయాలు చేసుకుంటున్నారు.తెలంగాణ బీజేపీ రాను రాను కుంచించించుకుపోతోంది. దానికి పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్న చోట ఆ పార్టీకి మంచి ఫలితాలు వస్తున్నాయి. కానీ తమ పార్టీ ప్రజా ప్రతినిధులు ఉన్న చోట కూడా భారీ విజయాలు దక్కించుకోలేకపోతోంది. ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. వారంతా మంచి మెజార్టీలతో గెలిచారు. కానీ పంచాయతీ ఎన్నికలను పట్టించుకోవడం లేదు. ఈటల రాజేందర్ మల్కాజిగిరి కన్నా హుజూరాబాద్ పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఇతర ఎంపీలూ అంతే.ఎవరికి పదవి ఇస్తే ఎవరు అసంతృప్తికి గురవుతారోనన్న ఉద్దేశంతో అందర్నీసమానంగా ఉంచుతూ.. ప్రధాన పదవులకు పెద్దగా పోటీ పడని రామచంద్రరావును అధ్యక్షుడిగా నియమించారు. కానీ ఈ నియామకాన్ని బీజేపీ నేతలు వేరేగా తీసుకున్నారు. అసలు పని చేయడం మానేసారు. కొంత మంది అడ్వాంటేజ్ గా తీసుకున్నారు. తెలంగాణ బీజేపీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తో పాటు డీకే అరుణ, రఘునందన్ రావు లాంటి వాళ్లు ఉన్నారు. అందరూ ఎప్పుడూ ఒక్క మాట మీద లేరు. ఎవరి రాజకీయాలు వారు చేస్తున్నారు. వీరిలో ఎవరికైనా అధ్యక్ష పదవి వచ్చి ఉంటే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండేది. ఇప్పుడు రామచంద్రరావు చెప్పిన మాట వినరు. పార్టీ తరపున పోరాటం చేయరు. దీంతో హైకమాండ్ రామచంద్రరావు నియామకంలో చేసిన ప్రయోగం రివర్స్ అయినట్లయింది.బండి సంజయ్ నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ పరిస్థితి మెరుగ్గానే ఉండేది. కానీ ఆయన ఎదుగుదల చాలా మందికి నచ్చలేదు. అందుకే నియంత్రించారు. చివరికి ఇప్పుడు అటూ ఇటూ కాకుండా అయిపోయింది. అటు ఈటలను



ప్రోత్సహిస్తే బండి సంజయ్ ఒప్పుకోరు. బండి సంజయ్ ను ప్రోత్సహిస్తే ఈటల, కిషన్ రెడ్డి అంగీకరించరు. పార్టీ నేతల మధ్య ఏ మాత్రం సరిపడని ఈ రాజకీయాన్ని మోదీ ఎంతో కాలం సహించే అవకాశం లేదు. పార్టీ పరిస్థితి మెరుగుపడకపోతే ఆయన కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

విషయాలను బయటపెట్టింది ఎవరనేది మిస్టరీ..

మోదీతో తెలంగాణ ఎంపీల భేటీకి సంబంధించిన వివరాలు బయటకు రావడంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీరియస్ అయ్యారు. భేటీ వివరాలను లీకు చేసినోళ్లు మెంటల్‌గాళ్లు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ వివరాలను బయటకు చెప్పొద్దని స్వయంగా మోదీ ఆదేశించినా పట్టించుకోకపోవడం విచారకరం అంటూ మీడియాతో చిట్‌చాట్‌లో అన్నారు. లీకులు ఇచ్చిన ఎంపీలెవరో మీడియా ప్రతినిధులు చెప్తే.. వారిపై చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఐతే ఇక్కడే కొత్త చర్చ జరుగుతోంది. మోదీతో మీటింగ్ వివరాలు బయటపెట్టిన వాళ్లను మెంటల్‌గాళ్లు అంటూ కిషన్ రెడ్డి సంభోదించారంటే.. విషయం ఎంత సీరియస్సో.. జాతీయ నాయకత్వం ఎలాంటి తీరుతో ఉందో అర్థం అవుతుందనే చర్చ.. సొంత పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.ఇదంతా ఎలా ఉన్నా.. మోదీ సమావేశ విషయాలను బయటపెట్టింది ఎవరనేది మిస్టరీగా మారింది. ప్రధానితో సమావేశం అయిన వారిలో.. తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ ఎంపీలు కూడా ఉన్నారు. ఇందులో సమావేశ వివరాలను బయటపెట్టాల్సిన అవసరం ఎవరికి ఉందన్న దానిపై ఆరా తీస్తున్నారని తెలుస్తోంది. కర్ణాటక, కేరళ ఎంపీలకు.. తెలుగు రాష్ట్రాల్లో మీడియా ప్రతినిధులతో పెద్దగా పరిచయం ఉండే అవకాశం లేదు. దీంతో తెలుగు రాష్ట్రాల ఎంపీలే.. ఈ విషయాలను బయటపెట్టి ఉంటారనే డిస్కషన్ నడుస్తోంది. దీంతో లీకు వీరుడు ఎవరనేది తెలుసుకునే ప్రయత్నంలో బీజేపీ నేతలు ఉన్నారట. మరి అది ఎవరో తెలిస్తే.. అసలు విషయం తేలితే.. ఎలాంటి చర్యలు ఉంటాయనేది హాట్‌టాపిక్‌గా మారింది.

# పరిషత్ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్

హైదరాబాద్, డిసెంబర్ 18 (

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల పోరు ముగిసింది. మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ జరిగింది. చివరి విడత పోలింగ్ బుధవారం పూర్తయింది. అయితే, పంచాయతీ




పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మూడు విడతల్లోనూ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులుగా పోటీ చేసిన సర్పంచ్ లు అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. అయితే, ఇదే ఊపులో జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలనుసైతం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. మండల పరిషత్ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ (జడ్పీటీసీ) ఎన్నికలను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వ భావిస్తుంది. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వానికి చెప్పిందని సమాచారం. దీంతో ఈ నెలాఖరులో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు.. తొలుత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందట. అన్నీ అనుకూలిస్తే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కంటే ముందే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వంలోని ముఖ్యులు పేర్కొంటున్నట్లు సమాచారం.పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని పల్లె ప్రజలు అధికార పార్టీ వైపే ఉన్నారని నిరూపించింది. ఇదే వేడిలో మున్సిపల్ ఎన్నికలను నిర్వహించి పట్టణ ప్రాంత ప్రజలుసైతం కాంగ్రెస్ ప్రభుత్వం వైపే ఉన్నారని స్పష్టం చేయాలని కాంగ్రెస్ పెద్దల ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. అన్నీ కుదిరితే జనవరిలోనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, పార్టీ పరంగా జరిగే మున్సిపల్ ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.వాస్తవానికి పంచాయతీ ఎన్నికల్లోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ప్రత్యేకంగా జీవో 9 జారీ చేసింది. అయితే, మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించరాదని, పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలను నిర్వహించుకోవచ్చునని కోర్టులు స్పష్టం చేశాయి. దీంతో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను నిలిపివేశాయి. మరోవైపు.. పంచాయతీలకు పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పని పరిస్థితుల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు లేకుండానే పంచాయతీ ఎన్నికలకు వెళ్లింది. అయితే, మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.మున్సిపల్, పరిషత్ ఎన్నికలు పార్టీ గుర్తుపై నిర్వహించే ఎన్నికలు కావడంతో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో బీసీలకు పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే తొలుత మున్సిపల్, ఆ తరువాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం జనవరి మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల సమాచారం.

# మూడో డిస్కం రెడీ

హైదరాబాద్, డిసెంబర్ 18

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచడానికి, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి మూడో డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న రెండు డిస్కంలపై భారాన్ని తగ్గించి, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే దీని లక్ష్యం. ఈ కొత్త డిస్కం ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడంలో సహాయపడుతుంది. త్వరలోనే ఇది ఏర్పాటు కానుందని సమాచారం.తెలంగాణలో అధికారంలోకి



వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర అభివృద్ధికి అనేక సంస్కరణలు, నిర్ణయాలు తీసుకుంటున్న రేవంత్ సర్కార్.. ప్రజల సంక్షేమం కోసం కూడా పలు పథకాలు ప్రారంభించింది. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో తాజాగా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మూడో డిస్కం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మూడో డిస్కం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం తెలంగాణలో రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు ఉన్నాయి. వీటికి తోడుగా.. మూడో డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని అంటున్నారు.ప్రస్తుతం తెలంగాణలో ఉన్న ఈ 2 డిస్కంల పరిధి చాలా ఎక్కువగా ఉండటమే కాక.. విద్యుత్ డిమాండ్ కూడా భారీగా పెరగడం వల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రస్తుతం టీఎస్ఎస్‌పీడీసీఎల్ టీఎస్ఎన్‌పీడీసీఎల్ ద్వారా విద్యుత్ పంపిణీ జరుగుతోంది. త్వరలోనే వీటి సరసన మరో డిస్కం చేరనుంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తుతో పాటు.. వ్యవసాయం, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచిత విద్యుత్ సరఫరా వంటి పథకాలను ప్రవేశపెట్టింది. వీటి వల్ల.. ప్రస్తుతం ఉన్న టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ డిస్కంలపై ఆర్థిక భారం పెరిగింది.దీన్ని తగ్గించడంతోపాటు.. ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని సంస్కరించడం కోసం మూడో డిస్కం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న సదరన్, నార్తర్న్ డిస్కంస్ తో పాటు త్వరలోనే ఏర్పాటు చేయబోతున్న ఈ కొత్త డిస్కం పనిచేయనుంది. మూడో డిస్కం ఏర్పాటు వల్ల విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్థిక సమస్యలు తగ్గడమే కాక.. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం లభిస్తుందని అంటున్నారు.


# నేడు గోవా విముక్తి దినం

## -పోర్చుగీసు పాలన నుండి గోవా ను విముక్తి చేసిన భారత సాయుధ దళాలు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

భారతదేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 19న గోవా విమోచన దినోత్సవాన్ని జరుపుకుంటారు. 450 సంవత్సరాల పోర్చుగీసు పాలన తరువాత 1961లో గోవాను భారత సాయుధ దళాలు విముక్తి చేసిన రోజును ఇది గుర్తు చేస్తుంది. 1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు గోవా ఇంకా పోర్చుగీసు పాలనలో నే ఉంది. పోర్చుగీసు వారు గోవా, ఇతర భారత భూభాగాలపై తమ పట్టును వదులుకోవడానికి నిరాకరించారు. పోర్చుగీసుతో అనేక విఫల చర్చలు మరియు దౌత్య ప్రయత్నాలు తరువాత, భారత మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, సైనిక జోక్యం ఒక్కటే మార్గంగా నిర్ణయించారు. భారత నౌకాదళ సమాచారం ప్రకారం, భారత దళాలు స్వల్ప ప్రతిఘటనతో డిసెంబర్ 19న గోవా భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. పదవీచ్యుత గవర్నర్-జనరల్ మాన్యుయేల్ ఆంటోనియో వాసాలో ఇ సిల్వా ఈ ప్రాంతంలో పోర్చుగీసు పాలనను అంతమొందించడానికి లొంగుబాటు సర్టిఫికేట్ పై సంతకం చేశారు. దీంతో భారత్ పూర్తిగా పరాయి పాలన నుంచి విముక్తి పొందాడు. "గోవా, డామన్ మరియు డయ్యూ ప్రాంతాల విముక్తి కోసం భారత నౌకాదళం చేపట్టిన "ఆపరేషన్ విజయ్" లో 1961 డిసెంబర్ 19న తమ ప్రాణాలను త్యాగం చేసిన ఏడుగురు యువ నావికులు, ఇతర సిబ్బంది జ్ఞాపకార్థం గోమంతక్ వద్ద యుద్ధ స్మారకం నిర్మించబడింది. గోవా విమోచన దినోత్సవం సందర్భంగా గోవాలో ఘనంగా ఉత్సవాలు, ఉత్సవాలు గోవాలో ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాల నుంచి టార్చ్ లైట్ ఊరేగింపు ను వెలిగించారు, చివరికి ఆజాద్ మైదాన్ లో అందరూ సమావేశం అయ్యారు. గోవా ను స్వాధీనం చేసుకోవడంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పిస్తారు.

# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ



అదిలాబాద్, డిసెంబర్ 18 (

కేంద్రం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తున్న క్రమంలో గత కొద్ది రోజులుగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో పెద్ద మొత్తంలో మావోయిస్టులు లొంగుబాటులకు సిద్ధమవుతున్నారు. పలుచోట్ల ఎన్కౌంటర్లు జరగ్గా, ఇటీవల ఓ పక్కా మావోల లేఖ కలకలం రేపింది. ఈ తరుణంలోనే తాజాగా తెలంగాణలోని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్టు తెలుస్తోంది. అయితే సోమవారం రాత్రి పూట సమాచారం తెలుసుకొని ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో వారిని హైదరాబాద్ డిజిపి కార్యాలయానికి వేకువ జామున తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. వీరంతా ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బస్తర్ ఏరియా నుంచి వచ్చి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ)లో ఓ ఇంట్లో 16 మంది మావోయిస్టులు ఉన్నట్లు తెలుసుకొని సోమవారం రాత్రి కూంబింగ్ నిర్వహించిన పోలీసులు 16 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. ఛతీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మావోలు వారి స్థావరాలను మారుస్తున్నారు. పోలీస్ నిఘా విభాగం సమాచారంతో ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, స్పెషల్ పార్టీ పోలీసులు సిర్పూర్ (యు)లో సోమవారం రాత్రి 16మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారిలో 9 మంది మహిళలు ఉండగా 7 పురుషులు ఉన్నట్లు తెలిసింది. ఇందులో ముఖ్యంగా మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నట్లు సమాచారం. డిస్ట్రిక్ట్ కమాండెంట్ మెంబర్స్ స్థాయి కేడర్స్ వారు నలుగురు ఉన్నట్లు తెలుస్తోంది. పట్టుపడ్డ వారిని సోమవారం రాత్రికి రాత్రే హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయానికి తరలించినట్లు తెలిసింది. ఒకట్రెండు రోజుల్లో డిజిపి కార్యాలయంలో ఈ విషయాన్ని మీడియా ముందు ప్రకటించే అవకాశం ఉంది.

# కేటీఆర్‌కు కవితపై ప్రేమ ఎంత ఉందా..లేదా?

హైదరాబాద్, డిసెంబర్ 18,

భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా కవితను టార్గెట్ చేసుకుని తమ పార్టీకి ఎంత నష్టం చేయాలో అంత నష్టం చేస్తోంది. కొత్తగా కేటీఆర్ కు కవితపై ప్రేమ ఉందా లేదా అన్న డిబేట్ ను ప్రారభించింది. అంత అవసరం ఏముందో కానీ.. జాగృతి సోషల్ మీడియా గట్టిగానే కౌంటర్ ఇస్తూ.. విషయాన్ని పెద్దది చేస్తున్నారు.కవిత ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తనను బీజేపీ జైల్లో పెడితే కేటీఆర్ కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ ఆరోపణలకు బీఆర్ఎస్ సోషల్మీడియా ఉలిక్కిపడి స్పందించింది. కవితను అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు కేటీఆర్ అడ్డం పడ్డారని అప్పటి వీడియోలు చూపిస్తున్నారు. కానీ జాగృతి సోషల్ మీడియా మాత్రం అదంతా డ్రామానేనని.. కవితను త్వరగా జైలుకుపంపాలని ఈడీకి చెప్పారని.. జైలుకు తీసుకెళ్లేందుకు కారులో ఎక్కించుకున్న తరవాత హరీష్ రావు,కేటీఆర్ నవ్వుకున్నారని వీడియోలు పెట్టారు. కేటీఆర్ఎప్పుడూ కవితపై ప్రేమాభిమానాలు చూపించలేదని అంటున్నారు.జాగృతి కార్యకర్తలు కొత్త కొత్త విషయాలు బయట పెడుతూండటంతో.. కేటీఆర్ మొదటి నుంచి కవితపై అంత సానుకూలంగా లేరన్నప్రచారం ప్రారంభమవుతోంది. కేటీఆర్ తన సోదరిపై ఎంతో ఆప్యాయంగా ఉంటారని నమ్మించేందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా తంటాలు పడుతోంది. కానీ ఇలాంటి చర్చ పెట్టి కేటీఆర్ పై కొత్త అనుమానాలు రేకెత్తించడంలో మాత్రం.. బీఆర్ఎస్ సోషల్ మీడియా సక్సెస్ అయింది. ఇదంతా ఆ పార్టీకి అవసరం లేని వివాదాలు తెచ్చి పెట్టడానికి తప్ప దేనికీ ఉపయోగపడవు.

============

# ప్రభుత్వ విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, డిసెంబర్ 18(భారతశక్తి ప్రతినిధి):

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని 12 వేల మంది విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స అందించనున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న దంత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. బధిర విద్యార్థులకు నిర్వహించిన దంత వైద్య పరీక్షలు, చికిత్స వివరాలను క్యాంపు నిర్వహిస్తున్న డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు, మున్సిపల్ కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స చేయించాలని నిర్ణయించామని అన్నారు.




ఇప్పటికే మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక క్యాంపు నిర్వహించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 12 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక క్యాంపుల ద్వారా దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. 9 వేల మంది విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యాయని, 24 మందికి చికిత్స అవసరంగా భావించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స అందజేశామని తెలిపారు. స్క్రీనింగ్ పూర్తయ్యాక పిల్లలకు చికిత్స అవసరమో గుర్తించి వైద్యం చేయిస్తామని అన్నారు.

కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో దంత వైద్య చికిత్సకు కావలసిన అన్ని సౌకర్యాలు, వైద్య బృందం ఉందని అన్నారు. చికిత్సకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, డెంటల్ ప్రత్యేక నిపుణులు రవి ప్రవీణ్, రణధీర్, సాహిత్య, ప్రిన్సిపల్ కమల పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిగ్రస్తుల నిర్ధారణకు ఇంటింటి సర్వేను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, డిసెంబర్ 18(భారతశక్తి ప్రతినిధి):



జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 18నుండి 31వ వరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జెండా ఊపి సర్వేను గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి అనుమానితులను గుర్తించాలని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వాళ్ళకి మందులు, పూర్తి చికిత్స అందించాలని కోరారు. ఆరోగ్యసిబ్బందికి ప్రజలు సహకరించాలని, కుష్టు వ్యాధి నిర్ధారణ అయిన వారు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న మందులతో పాటు పూర్తి చికిత్స తీసుకొని నయం చేసుకోవచ్చని తెలిపారు. లెప్రసీ వ్యాధి లక్షణాలను గురించి ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. లెప్రసీ వ్యాధి చికిత్సకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న మందులను పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ 14 రోజులపాటు ప్రతి హాబిటేషన్లో ప్రతి ఇంటింటికి సర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి కారక క్రిమి మైక్రో బ్యాక్టీరియా లేప్రే మానవ శరీరంలో ప్రవేశిస్తుందని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తిని అనుసరించి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి 3 నుంచి 5 సంవత్సరాల కాలం పడుతుందని అన్నారు. దీన్ని పూర్తిగా తగ్గించడానికి బహుళ ఔషధ చికిత్స ఉందన్నారు. ఈ వ్యాధి లక్షణాలను ముందే గుర్తిస్తే పూర్తి చికిత్స తీసుకొని తొందరలోనే నయం చేసుకోవచ్చని తెలిపారు.

జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ సుధ మాట్లాడుతూ స్పర్శ లేని ఎర్రని రాగ, గోధుమ రంగు మచ్చలు ఉన్నవారు ఆరోగ్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. డిటిసిఓ డాక్టర్ రవీందర్ రెడ్డి, పిఓ డిటిటి డాక్టర్ ఉమాశ్రీ, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ రాజగోపాల్ రావు,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సల్మాన్, నర్సింగ్ కాలేజీ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల జిపిఎఫ్ అకౌంట్లను అప్డేట్ చేయాలి.

## ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు- వివి నాయక్

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18:

జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల, ఉపాధ్యాయుల అకౌంట్లను వెంటనే అప్డేట్ చేయాలని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వివి నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల అకౌంట్ లను అప్డేట్ చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వివి అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు మాత్రమే అకౌంట్లను అప్డేట్ చేయడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు తమ కుటుంబాల అవసరాల కోసం, పిల్లల చదువులు, వివాహాలు తదితర అవసరాల కోసం లోన్లు పెట్టుకుంటే అకౌంట్లు అప్డేట్ కాని కారణంగా తక్కువ మొత్తంలో రుణాలు వస్తున్నాయని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు అకౌంట్ లను వెంటనే అప్డేట్ చేసి, ఉద్యోగులు తమ జిపిఎఫ్ బ్యాలెన్స్ చూసుకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ అంశాల పై జెడ్పీ సీఈవో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు తొగరు రామయ్య, కస్తూరి కిషన్ ప్రసాద్, నరసింహస్వామి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ఈ పండ్లను తింటే మీకు అసలు క్యాన్సర్ రాదు..

## క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి..

హైదరాబ్బాద్ డిసెంబర్ 18

ప్రస్తుతం భారతీయులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లల్లో క్యాన్సర్ కూడా ఒకటి. రోజురోజుకీ ఈ వ్యాధి బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందనే చెప్పవచ్చు. జీవన విధానంలో మార్పులు, ధూమపానం, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం, రేడియేషన్ కు ఎక్కువగా గురవ్వడం, రసాయనాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం, జన్యుపరమైన కారణాల వల్ల చాలా మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అలాగే ఈ వ్యాధికి సరైన మందు లేదనే విషయం మనందరికీ తెలిసిందే. కనుక వ్యాధి బారిన పడి బాధపడడానికి బదులుగా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా మన ఆహారంలో మార్పులు చేసుకోవడం మరింత అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మామిడి, నేరేడు..

క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కొన్ని రకాల పండ్లు మనకు ఎంతగానో దోహదపడతాయని వారు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదల తగ్గడంతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని వారు తెలియజేస్తున్నారు. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించే పండ్ల గురించి వివరాలను అందిస్తున్నారు. మామిడి పండ్లల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల అసాధారణ కణాల పెరుగుదల వేగం తగ్గుతుంది. అలాగే నేరేడు పండ్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో మనకు సహాయపడతాయి. వీటిలో యాంటీ ప్రొలిఫెరేటివ్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి హానికారక కణాల వ్యాప్తిని తగ్గించడంలో దోహదపడతాయి.

ఉసిరి, మారేడు..


ఉసిరికాయలను తీసుకోవడం వల్ల కూడా మనం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ఉసిరిలో ప్రీక్లినికల్ నమూనాలు ఉంటాయని వీటి సారం క్యాన్సర్ పై ఆశాజనక ప్రభావాలను చూపించదని నిపుణులు చెబుతున్నారు.

# జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపిన ఎన్నికల సంఘం

## -కరీంనగర్ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానం
## -సోషల్ మీడియా వేదికగా పమేలా సత్పతికి కితాబు

కరీంనగర్, డిసెంబర్ 18(భారతశక్తి ప్రతినిధి):

ఇళ్లు ఆరోగ్యంగా విలసిల్లుతే జిల్లా ఆరోగ్యంగా ఉంటదని భావిస్తూ, ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాలను సమన్వయ పరుస్తూ అందరి మన్నలను చూరగొంటూ మందుకు నడుస్తున్నది మన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి రాష్ట్ర ఎన్నికల సంఘం సోషల్ మీడియా వేదికగా అభినందనల వర్షం కురిపిస్తు జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపిరానడంలో అతిశయోక్తి లేదంటున్నారు.



ఇటీవల జరిగిన మూడు దశల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని విజయవంతంగా పూర్తిచేసిన మొదటి జిల్లాగా కరీంనగర్ నిలిచింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఎన్నికల సంఘం పేర్కొంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ జిల్లాలో మొత్తం మూడు దశల్లో అన్ని జిల్లాల కంటే ముందుగా ఎన్నికల ప్రక్రియ ను పూర్తి చేసిన జిల్లాగా కరీంనగర్ నిలిచి నందుకు గాను జిల్లా కలెక్టర్ తో బాటు ఎన్నికల యంత్రాంగాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రశంసించింది.

జిల్లాలో ఈనెల 11, 14, 17 తేదీల్లో గ్రామపంచాయతీ ఎన్నికలకు పోలింగ్ జరిగింది. 11న గంగాధర, చొప్పదండి, రామడుగు, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాలకు నిర్వహించిన పోలింగ్ 81.42 శాతం నమోదయింది. రెండో విడతలో ఈనెల 14న చిగురుమామిడి, గన్నేరువరం, శంకరపట్నం, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాలకు పోలింగ్ నిర్వహించగా 86.58 శాతం పోలింగ్ నమోదయింది. మూడో విడతలో హుజురాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, వి సైదాపూర్ మండలాలకు పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగగా 86.42% పోలింగ్ నమోదయింది.

అధికారులను, సిబ్బందిని అభినందించిన జిల్లా కలెక్టర్

పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లోనూ విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికారులు, పోలింగ్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందనలు తెలిపారు.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణకు కృషి చేసిన సాధారణ పరిశీలకులు వెంకటేశ్వర్లును, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ను కలెక్టర్ అభినందించారు.

# పని బాధ్యత లేని కేంద్ర కొత్త బిల్లు

## కాంట్రాక్టర్లు, భూస్వాముల మేలు పత్రాలు దహనం

కరీంనగర్, డిసెంబర్ 18(భారతశక్తి ప్రతినిది):

వ్యవసాయ కార్మిక సంఘాలు , వామపక్షాల పోరాట ఫలితంగా యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టమని, ఆ పేరును మార్చి వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అవిజిక మిషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం నగరంలోని గీత భవన్ చౌరస్తాలో కొత్త చట్టం బిల్లు కాఫీలను దహనం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కవ్వం పల్లి రాజు, కార్యదర్శి వడ్ల రాజులు మాట్లాడుతూ మాట్లాడుతూ పని కల్పించే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పు కోవడానికి కొత్త బిల్లును తెచ్చారనీ ఆరోపించారు. వంద రోజుల నుండి 125 రోజులకు పని దినాలు పెంచుతున్నామంటూనే 90% నిధులు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులను ఇవ్వాలని ప్రతిపాదించడం కేంద్రం తన బాధ్యతల నుండి తప్పు కోవడం తప్ప మరొకటి కాదన్నారు. గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములకు తలొగ్గి వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న కాలంలో 60 రోజులు పనిని పెట్టకుండా వాయిదా వేస్తామని ప్రతిపాదించడం జాబ్ కార్డు కలిగిన వ్యక్తి ఎప్పుడు పని అడిగిన ఇవ్వాలి అనే చట్టం మౌలిక డైరెక్షనకు తూట్లు పొడవటమే అవుతుందన్నారు. నిరుద్యోగ భృతి వేతనాలు చెల్లింపు ఆలస్యం రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత అని ప్రతిపాదించడం అత్యంత దుర్మార్గమైన విషయం మరువద్దన్నారు. ఇప్పటికే సకాలంలో కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం వలన గత సంవత్సరం చేసిన పనికి వేతనాలు రాక కూలీలు ఎదురు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మాట వినలేదని పశ్చిమ బెంగాల్లో ఉపాధి హామీ పనిని పెట్టకుండా ఎత్తివేశారు . డిజిటలైజేషన్ , కేవైసీ అప్డేట్, ఆధార్ కార్డు బ్యాంకు ఎకౌంటు ఉపాధి జాబ్ కార్డు లింక్ పేరుతో బిజెపి ఏతర రాష్ట్రాలలో లక్షలాదిమంది జాబు కార్డులను తొలగించారు . కోట్లాదిమంది పేదలను పనికి దూరంగా నెట్టారు మెటీరియల్ కాంపోనెంట్ పేరుతో 22 శాతంగా ఉన్న నిధులను 49 శాతానికి పెంచి కాంట్రాక్టర్లకు పనులను అప్పగించారు. ఉన్న కొద్దిపాటి నిధులను కూడా పేదలకు దక్కకుండా గ్రామీణ ప్రాంత భూస్వాములు , కాంట్రాక్టర్లకు అప్పగించడం కోసం బిజెపి ప్రభుత్వం కొత్త బిల్లును తీసుకొస్తున్నది తక్షణమే దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాయకండి శ్రీనివాస్, కమిటీ సభ్యులు సత్యనారాయణ చారి, నాయకులు రాజకుమార్, శ్రీకర్, కిరణ్ ,రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



# గీతంలో అంతరిక్ష శాస్త్రం, రక్షణ సాంకేతికతపై జాతీయ సెమినార్ ప్రారంభం

## - ముఖ్య అతిథిగా పాల్గొని, కీలకోపన్యాసం చేసిన డీఆర్ డీవో పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ జి.రామగురు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 18:

భారత వైమానిక దళం సహకారంతో హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో అంతరిక్ష శాస్త్రం, రక్షణ సాంకేతికతలో పురోగతి అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ గురువారం విజయవంతంగా ప్రారంభమైంది. ఐఐటీ హైదరాబాదులోని డీఆర్ డీవో-ఇండస్ట్రీ-అకాడెమియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (డీఐఏ సీవోఈ) డైరెక్టర్ డాక్టర్ జి. రామగురు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు.

రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్ డీవో)లో తన 35 ఏళ్ల అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, నిర్మాణాత్మక నిధులు, సహకారం ద్వారా దేశవ్యాప్తంగా రక్షణ ఆధారిత పరిశోధన, ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడంలో విద్యాసంస్థల కీలక పాత్రను డాక్టర్ రామగురు ప్రముఖంగా ప్రస్తావించారు.అంతరిక్ష శాస్త్రం, రక్షణ సాంకేతికతలలో పురోగతి జాతీయ భద్రత, వ్యూహాత్మక స్వావలంబనకు కీలకమైన స్తంభాలు అని డాక్టర్ రామగురు స్పష్టీకరించారు. స్వదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం నుంచి అధునాతన క్షిపణి, నిఘా వ్యవస్థలను అభివృద్ధి చేయడం వరకు భారతదేశం యొక్క ప్రయాణంతో సహా, సాంప్రదాయ భూమి, వాయు, నావికా కార్యకలాపాలతో పాటు సైబర్ భద్రత, అంతరిక్ష యుద్ధంతో సహా ఆధునిక యుద్ధ రంగాల గురించి ఆయన వివరించారు.అగ్ని క్షిపణి కార్యక్రమంలో సభ్యుడు డాక్టర్ రామగురు, భారతదేశం యొక్క నిరోధక సామర్థ్యాలు, కౌంటర్-డ్రోన్ వ్యవస్థలు, క్షిపణి రక్షణ చొరవలు, యూఏవీ అభివృద్ధి, స్వదేశీ రక్షణ కార్యకలాపాలతో సహా ఇటీవలి సాంకేతిక విజయాల గురించి మాట్లాడారు. డీఆర్ డీవో-అభివృద్ధి చేసిన సాంకేతికతల విజయాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఆత్మనిర్భర్ భారత్ కు అనుగుణంగా వాటిని అనుసంధానించారు. భారతదేశ రక్షణ, అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో స్కైరూట్ వంటి ప్రైవేటు స్పేస్ స్టార్టప్ ల పెరుగుతున్న సహకారాన్ని గుర్తించారు. సంకలిత తయారీ, అధునాతన పదార్థాలు, అల్ట్రా-హై-ఆల్టిట్యూడ్ ఆయుధాలు, హైపర్ సోనిక్ వ్యవస్థలు, తీవ్ర పరిస్థితులను తట్టుకోగల అధిక ఉష్ణోగ్రత పదార్థాల వంటి భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న రంగాలపై దృష్టి సారించే ఐఐటీ హైదరాబాదు యొక్క తొమ్మిది సాంకేతిక ప్రోత్సాహకాలను డాక్టర్ రామగురు వివరించారు.విద్యా సంస్థల పాత్రను నొక్కి చెబుతూ, యూఏవీలు, డ్రోన్లు, క్షిపణి వ్యవస్థలలో ఆవిష్కరణ విద్యా ప్రాంగణాలలో పెంపొందించే ఉత్సుకత, సృజనాత్మకతతో ప్రారంభమవుతుందని డాక్టర్ రామగురు వ్యాఖ్యానించారు. ధైర్యం, ఊహ, క్రమశిక్షణ, శ్రేష్ఠతకు నిబద్ధత పెంపొందించుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. తన గురువు శ్రీ రవిశంకర్ ను ఉటంకిస్తూ, యువ ఇంజనీర్లు ఊహను క్రమశిక్షణ, స్వేచ్ఛతో సమతుల్యం చేసుకోవాలన్నారు.సరైన సమయంలో, ఎంతో ఉపయుక్తమైన చర్చాగోష్ఠిని నిర్వహిస్తున్న గీతంను ఆయన అభినందించారు. విద్య, ఆవిష్కరణలపై దృష్టి పెట్టి, దేశ పురోగతికి అర్థవంతంగా దోహదపడేలా విద్యార్థులను ప్రేరేపించారు.స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, కోర్ ఇంజనీరింగ్




డీన్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల, చర్చాగోష్ఠి కన్వీనర్ ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్, సమన్వయకర్త డాక్టర్ ఎండీ. అక్తర్ ఖాన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ గాంధీ, కెప్టెన్ అంబరీష్, భారత వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ మనోహరన్, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ శేషగిరిరావుతో సహా పలువురు విశిష్ట వక్తలు ఈ రెండు రోజుల సెమినార్ లో ఉపన్యసించనున్నారు.

# సోనియా,రాహుల్ పై అక్రమ కేసులు కొట్టివేత

## - బీజేపీ కి ఇది చెంపపెట్టు
## -టీపీసీసీ కార్యదర్శి తోపాజీ అనంత కిషన్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 18 :

కుట్రలతో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, యువనేత రాహుల్ గాంధీలపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయడం పట్ల కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కేసులు కెట్టివేత బీజేపీకి చెంప పెట్టులాంటిదని టీపీసీసీ కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ అన్నారు. గాంధీల కుటుంబాల చరిత్రను చెరిపేయడానికి బీజేపీ కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పై బీజేపీ కుట్ర రాజకీయాలను నిరసిస్తూ సంగారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ కొత్త బస్ స్టాండ్ వద్ద రాస్తా రోకో చేపట్టారు. బీజేపీ కుట్ర రాజకీయాలను ఎక్కడికక్కడ ఎండగడతామని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వంలోని ప్రధానిమోదీ, అమిత్ షాలు కక్ష్య పూరితంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులు, సీడీసీ చైర్మెన్ రామ్ రెడ్డి, కాంగ్రెస్



నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, షఫీ, నాగరాజ్, వెంకట్ రాజ్, ఆరిఫ్, బాబు, అరుణ్, మహేష్ లాల్, అర్జున్, నరేన్, కసిని రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి జూడో చాంపియన్ పోటీలకు పారమిత

కరీంనగర్, డిసెంబర్ 18(భారతశక్తి ప్రతినిధి):

పారమిత హెరిటేజ్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి రిషిత్ రాష్ట్ర స్థాయి జూడో చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక అయ్యారాని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపిక్రిష్ణ తెలిపారు. డిసెంబర్ 18 న కరీంనగర్ పట్టణంలోని రీజన్ స్పోర్ట్స్ స్కూల్ ఇండోర్ లో జరిగిన జిల్లా ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎస్.జి.ఎఫ్ అండర్ 14 బాలుర జూడో చాంపియన్షిప్ పోటీలలో పారమిత హెరిటేజ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కొత్తపెల్లి రిషిత్ 50o కిలోల విభాగంలో బంగారు పధకం సాధించి రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైనాడు.



రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 20 నుండి 22 వరకు హన్మకొండ పట్టణంలోని జె.ఎన్ స్టేడియంలో నిర్వ హించనున్న 69వ రాష్ట్ర స్థాయి జూడో బాలుర చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్లు . ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు. ఎం. ప్రసాద్ , హనుమంతరావు. ప్రధానోపాధ్యాయులు గోపిక్రిష్ణ , సమన్వయకర్త రబీంద్రపాత్ర, రాష్ట్ర స్థాయి జూడో కోచ్ గోలి సుదాకర్ ను అభినందించారు.

# దేశానికే ఆదర్శం స్మార్ట్ కిచెన్ విధానం.:జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్

వైఎస్ఆర్ కడప,డిసెంబర్ 18(భారత శక్తి):

వై ఎస్ ఆర్ కడప జిల్లాలో చేపట్టిన స్మార్ట్ కిచెన్ విధానం దేశానికే ఆదర్శంగా కలదని ఈ విధానాన్ని జిల్లాలో అమలు చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వారిని గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అభినందించారు. అమరావతి లో రెండు రోజుల పాటు జరుగుతున్న 5వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో భాగంగా గురువారం రెండో రోజు బెస్ట్ ప్రాక్టీసెస్ సక్సెస్ స్టోరీ లపై ప్రజెంటేషన్ ఇచ్చిన ఆరు జిల్లాల కలెక్టర్లు.వై ఎస్ ఆర్ కడప జిల్లా లో వినూత్నంగా అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ విధానం గురించి కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో వివరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి. వైయస్సార్ కడప జిల్లాలో 136 పాఠశాలల్లో 10,322 మంది విద్యార్థులకు ఐదు స్మార్ట్ కిచెన్ ల ద్వారా నాణ్యమైన రుచికరమైన పోషక విలువలతో కూడిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం



ను అమలు చేస్తున్నామన్నారు.పౌష్టికాహారం విద్యార్థులకు వేడిగా, రుచిగా అందించేలా ఈ స్మార్ట్ కిచెన్ కార్యక్రమాన్ని చేపట్టామని,ప్రతి మండలానికీ ఓ స్మార్ట్ కిచెన్ పెట్టి పాఠశాలలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని,స్మార్ట్ కిచెన్ కోసం 3 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్, బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేశామని వివరించారు. సెంట్రల్ కంట్రోల్ రూమ్ ద్వారా స్మార్ట్ కిచెన్ విధానాన్ని పర్యవేక్షించడం జరుగుతుందని, ప్రస్తుతం కడపలో 5 స్మార్ట్ కిచెన్లున్నాయని ఈ స్మార్ట్ కిచెన్ విధానం నందు మోడ్రన్ కిచెన్ ఏర్పాటు చేసి వంట సిద్ధం చేసే వారు కూడా పూర్తి వ్యక్తిగత పరిశుభ్రత ఉండేలా వారికి డ్రెస్ కోడ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.10 ఎండియు వాహనాల ద్వారా పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నామని, ఐఎస్ఓ 9001 సర్టిఫికేషన్, ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ సర్టిఫికేషన్ తో పాటు రెగ్యులర్ గా ఫుడ్ క్వాలిటీ కంట్రోల్ ను పరిశీలించడం జరుగుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుకరించే రైతుల నుండి మధ్యాహ్న భోజనం పథకమునకు అవసరమైన వస్తువులను ప్రొక్యూర్మెంట్ చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 33 స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేయబోతున్నామని,ఈ స్మార్ట్ కిచెన్ విధానం బాగుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రొత్సహించారని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వై ఎస్ ఆర్ కడప జిల్లాలో చేపట్టిన స్మార్ట్ కిచెన్ విధానం దేశానికే ఆదర్శంగా మారిందని, స్మార్ట్ కిచెన్... స్మార్ట్ హెల్త్... స్మార్ట్ చిల్డ్రన్ అన్నట్టుగా ఈ విధానాన్ని తీర్చిదిద్దాలని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు కడప స్మార్ట్ కిచెన్లను సందర్శించాలని,స్మార్ట్ కిచెన్ ద్వారా తాజా, రుచికరమైన ఆహారం అందించటం, న్యూట్రిషనిస్టుల సహాకారం తీసుకోవటం మంచి ఆలోచన అన్నారు. నాచురల్ ఫార్మింగ్ ను కూడా దీనికి ఇంటిగ్రేషన్ చేయటం చాలా బాగుందని స్మార్ట్ కిచెన్ కు సర్టిఫికేషన్ కూడా తీసుకోవటం అభినందనీయమని ,టీటీడీ తరహాలోనే తనిఖీ వ్యవస్థ ఉండాలనన్నారు.రైతు బజార్లలోనూ నాచురల్ ఫార్మింగ్ ఉత్పత్తులు రావాలి. సర్టిఫికేషన్ తో పాటు డోర్ డెలివరీ వచ్చేలా ఉండాలి.స్మార్ట్ కిచెన్ల ద్వారా అంగన్ వాడీలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకూ ఆహారం అందించాలని.కడపలోని అన్ని స్కూళ్లల్లో చిన్నారులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలనన్నారు.రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూకడపలోని స్మార్ట్ కిచెన్ విధానాన్ని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు చూపించామని,ధర్మేంద్ర ప్రధాన్ కు స్మార్ట్ కిచెన్ విధానం నచ్చిందనన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్కూళ్లకు స్మార్ట్ కిచెన్ల ద్వారా ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని,స్మార్ట్ కిచెన్ ల నిర్మాణం కోసం జిల్లాలలో భూములను పరిశీలించాలని తెలిపారు.ఈ 5 వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ను వై ఎస్ ఆర్ కడప జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వర్చువల్ విధానంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు పాల్గొని వీక్షించారు.

# పల్స్ పోలియో కార్యక్రమం ను విజయవంతంగా నిర్వహించండి: జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్.

వై ఎస్ ఆర్ కడప,డిసెంబర్ 18(భారత శక్తి):

జిల్లాలో ఈనెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయం లోని




పీజిఆర్ఎస్ సమావేశపు మందిరం నందు ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణ పై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ పోలియో రహిత జిల్లాగా వైఎస్సార్ కడప జిల్లా ను నిలిపేందుకు ఈనెల 21న ఉ. 7 గంటల నుండి సా.5 గంటల వరకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాటు చేసిన బూత్ లలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని,ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు అందించాలన్నారు.జిల్లాలో 0%-%5 సంవత్సరాల వయసు గల పిల్లలు2,28,207 (అర్బన్ - 91,277, (గ్రామీణ- 1,36,930) మంది ఉన్నారని వీరందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు.జిల్లా లో 2103 బూత్‌లను ఏర్పాటు చేసారని, 4058 బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ నెల 21 వ తేదీన పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు ఈ నెల 22,23 వతేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈనెల 21, 22, 23వ తేదీలలో మూడు రోజల పాటు నిర్వహించే కార్య క్రమం ను వందశాతం విజయ వంతం గా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయం తో పనిచేయాలన్నారు.జిల్లా లో 557 పంచాయతీ లలో, 423 విలేజ్ సెక్రటేరియట్ లు,222 వార్డు సెక్రటేరియట్ లలో 203 రూట్స్ ద్వారా పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడిఓ లు, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు.జిల్లాలో 162 హైరిస్క్ ప్రాంతాలలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ 100 శాతం వ్యాక్సినేషన్ జరిగేలా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు.పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకొని పర్యవేక్షించాలన్నారు.బస్ స్టేషన్ లలో,రైల్వే స్టేషన్లలో పోలియో చుక్కలు వేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ బూత్ లను ఏర్పాటు చేయాలని,ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణపై గ్రామస్థాయి వరకు అవగాహన కల్పించేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.ఈ సమావేశంలో ఆరవ అదనపు జిల్లా జడ్జి ఎన్.శాంతి, ఇన్చార్జి డిఎం అండ్ హెచ్ ఓ డా. ఉమా మహేశ్వర కుమార్, డిసిహెచ్ఎస్ డా.హిమ దేవి,డి సి హెచ్ జి జి హెచ్ ఆర్.ఎమ్.ఓ. డా.లిల్లీ పుష్పా,అదనపు డీఎంహెచ్వో డా. రవి బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






# ఉదయమ్స్‌లో రిలయన్స్‌కు మెజారిటీ వాటా

ముకేశ్ అంబానీకి చెందిన ఎఫ్ఎంసీజీ సంస్థ రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ తన వ్యాపార పరిధిని క్రమంగా పెంచుకుంటోంది. వ్యూహాత్మక కొనుగోళ్లతో ముందడుగు వేస్తున్న ఆ సంస్థ.. తాజాగా తమిళనాడుకు చెందిన ఉదయమ్స్ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మెజారిటీ వాటా దక్కించుకుంది. స్నాక్స్‌తో పాటు ఇడ్లీ పిండి వంటి రెడీ టు కుక్ బ్రేక్ ఫాస్ట్ ఉత్పత్తులను మూడు దశాబ్దాలుగా విక్రయిస్తోంది. ఈ జాయింట్ వెంచర్‌లో భాగంగా ఆర్‌సీపీఎల్‌కు యాజమాన్య హక్కులు ఉంటాయి. ఉదయమ్స్ ప్రమోటర్లు మైనారిటీ వాటా కలిగి ఉంటారు. ఈ డీల్‌కు సంబంధించిన లావాదేవీ వివరాలు వెల్లడి కాలేదు. ఉదయమ్స్ బ్రాండ్ గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదని రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ డైరెక్టర్ టి కృష్ణకుమార్ అన్నారు. దశాబ్దాలుగా ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారాన్ని వినియోగదారులకు అందిస్తోందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా కంపెనీ సరికొత్త అధ్యాయం మొదలైందని ఉదయమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ సుధాకర్ పేర్కొన్నారు. దేశంలో ప్రాంతీయంగా ఉన్న ప్రముఖ బ్రాండ్లను వ్యూహాత్మకంగా రిలయన్స్ కొనుగోలు చేస్తోంది. వాటిని జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్లుగా తీర్చిదిద్దుతోంది. గతంలో కొనుగోలుచేసిన క్యాంపా, ష్యూర్ వాటర్, స్పిన్నర్ స్పోర్ట్స్ డ్రింక్స్, సిల్ జామ్, లోటస్ చాక్లెట్స్ వంటివి ఈ కోవలోకే వస్తాయి. ఈ క్రమంలోనే ఉదయమ్స్‌లో మెజారిటీ వాటాను రిలయన్స్ కొనుగోలు చేసింది. టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్, ఎంటీఆర్, ఐడీ ఫ్రెష్ వంటి సంస్థలకు ప్రాంతీయంగా ఈ కంపెనీ గట్టి పోటీ ఇస్తోంది.





# ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ట్రూకాలర్ కొత్త ఫీచర్




ప్రముఖ కాలర్ ఐడెంటిఫికేషన్ యాప్ ట్రూకాలర్ భారత్‌లోని ఆండ్రాయిడ్ యూజర్లకు కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. AIతో పనిచేసే వాయిస్‌మెయిల్ ఫీచర్‌ను లాంచ్ చేసింది. ఇన్‌స్టంట్ ట్రాన్స్‌క్రిప్షన్ సదుపాయంతో వస్తోంది. అంటే వచ్చిన వాయిస్ మెయిల్‌ను మీకు నచ్చిన భాషలోకి అనువదిస్తుంది. ఈ ఫీచర్‌ను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు ట్రూకాలర్ తెలిపింది. ఈ వాయిస్ మెసేజ్‌లు యూజర్ డివైజ్‌లోనే సేవ్ అవుతాయి. వాయిస్‌మెయిల్‌లో స్మార్ట్ కాల్ కేటగరైజేషన్, స్పామ్ ఫిల్టరింగ్, అడ్జస్టబుల్ ప్లేబ్యాక్ స్పీడ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. తెలుగు, హిందీ, బెంగాలీ, మరాఠీ, తమిళం, కన్నడ, మలయాళం, గుజరాతీ, నేపాలీ, పంజాబీ, సంస్కృతం, ఉర్దూ వంటి 12 భారతీయ భాషలకు ఈ యాప్ సపోర్ట్ చేస్తుంది. వాయిస్ మెయిల్ సేవలను రోజువారీ జీవితానికి అనుసంధానం చేసే ఉద్దేశంతో వాయిస్‌మెయిల్ సేవలను తీసుకొచ్చినట్లు ట్రూకాలర్ సీఈవో రిషిత్ ఝున్‌ఝున్‌వాలా పేర్కొన్నారు. ఇన్‌స్టంట్ ట్రాన్స్‌స్క్రిప్షన్, స్పామ్ ప్రొటెక్షన్‌తో ఈ ఫీచర్ వస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల ట్రూకాలర్ కాలింగ్ అనుభవం మరింత మెరుగవుతుందని తెలిపారు.

# గూగుల్ పే నుంచి కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డ్.. ఎలా అప్లయ్ చేయాలి?

దిల్లీ: ప్రముఖ యూపీఐ చెల్లింపుల యాప్ గూగుల్ పే మొదటిసారిగా రూపే నెట్‌వర్క్‌పై కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డు తీసుకొచ్చింది. ఇందుకోసం యాక్సిస్ బ్యాంక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. మర్చంట్ చెల్లింపుల కోసం ఈ కార్డును ఖాతాదారులు తమ యూపీఐ ఖాతాలకు అనుసంధానం చేసుకోవచ్చు. సాధారణంగా క్రెడిట్ కార్డుల సంస్థలు.. వినియోగదారు చెల్లింపు కాలవ్యవధి ముగింపులో రివార్డులు, క్యాష్‌బ్యాక్‌లు ఇస్తుండగా, తాజా కార్డు మాత్రం తక్షణ క్యాష్‌బ్యాక్, రివార్డులను అందించనుంది. తదుపరి లావాదేవీలోనే వీటిని వినియోగించుకోవచ్చని గూగుల్ సీనియర్ డైరెక్టర్, ప్రొడక్ట్ మేనేజర్ శరత్ బులుసు తెలిపారు.




ప్రస్తుతం రూపే యూపీఐ కార్డులకు ఆదరణ పెరుగుతోంది. క్రెడిట్ కార్డులను యూపీఐ తరహాలో వినియోగించుకునే సౌలభ్యం ఉండటమే ఇందుకు కారణం. మాస్టర్‌కార్డ్, వీసా క్రెడిట్ కార్డులను యూపీఐకు అనుసంధానం చేసుకోలేము. రూపే, యూపీఐలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది.

**ఎలా దరఖాస్తు చేసుకోవాలి?**

* గూగుల్‌పే ఫ్లెక్స్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డును గూగుల్ పే యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి రుసుములూ చెల్లించాల్సిన అవసరం లేదు. పైగా ఎలాంటి పేపర్ వర్క్ కూడా ఉండదు. ఆపై నిమిషాల వ్యవధిలోనే లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఈ కార్డు మొబైల్ ఫోన్‌లో ఉంటుంది కాబట్టి ఎప్పుడైనా వినియోగించుకోవచ్చు.
* ఈ కార్డు రూపే నెట్‌వర్క్‌పై పనిచేస్తుంది. ఎక్కడైనా ఆఫ్‌లైన్ మర్చంట్స్ లేదా ఆన్‌లైన్ షాపింగ్ అప్లికేషన్లలో చెల్లింపులకు వినియోగించుకోవచ్చు.
* పేమెంట్ ద్వారా వచ్చే రివార్డులను స్టార్‌గా వ్యవరిస్తారు. ఒక్కో స్టార్ ఒక్కో రూపాయితో సమానం. నెలాఖరు వరకు ఆగకుండా మీకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు వీటిని వినియోగించుకోవచ్చు.
* గూగుల్ పే అప్లికేషన్ ద్వారా మీ లావాదేవీలను ట్రాక్ చేసుకోవచ్చు. యాప్ నుంచే బిల్లు పేమెంట్ చేయొచ్చు. లావాదేవీలను ఈఎంఐ కింద కన్వర్ట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.
* ఈ క్రెడిట్ కార్డు యాప్‌లోనే ఉండడం వల్ల కార్డును సులువుగా మేనేజ్ చేయొచ్చు. కార్డు పరిమితులు, బ్లాక్ లేదా అన్‌బ్లాక్ చేయడం, పిన్ రీసెట్ చేసుకోవడం వంటివి గూగుల్ పే యాప్‌లోనే చేసుకోవచ్చు.




# మాట వినలేదని జట్టు నుంచి తీసేస్తే.. ఇప్పుడు SMAT టాపర్!



ఇషాన్ కిషన్‌కి పాకెట్ డైన మైట్ అని పేరు. భారీ సిక్సర్లతో విరుచుకుపడటం అతనికి సర్వసాధారణం. దేశవాళీలో సంపాదించుకున్న ఆ పేరుతో భారత క్రికెట్ జట్టులోకి వచ్చాడు. అవకాశం వచ్చిన ప్రతిసారీ తనేంటో బ్యాటుతో, కీపర్‌గా చేసి చూపించాడు. టీమ్ ఇండియాకు ఓ స్టార్ దొరికాడు అని అనుకుంటుండగా ఓ సిరీస్ నుంచి మధ్యలోనే స్వదేశానికి వచ్చేశాడు. ఆ తర్వాత ఇప్పటివరకు భారత జట్టులోకి రాలేదు. అలా జట్టుకు దూరమైన ఆ డైనమైట్ ఇప్పుడు SMAT వేదికగా మళ్లీ పేలింది. ఇండియన్ క్రికెట్‌ను ఫాలో అయ్యేవాళ్లకు ఇషాన్ కిషన్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. వైట్ బాల్ క్రికెట్‌లో దూకుడుకి ఓ పర్యాయపదం. ఓపెనర్‌గా వచ్చి వీరవిహారం చేసేవాడు. అయితే ఇదంతా గతం. ఎందుకంటే భారత జట్టు ఎంపిక సమయంలో ఈ పేరు కొన్నాళ్లు ప్రస్తావనకు రాలేదు. జాతీయ కాంట్రాక్ట్ కూడా కోల్పోయాడు. తన వల్లే తనకు ఎదురైన పరిస్థితిని ఇప్పుడు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సొంత రాష్ట్రం ఝార్ఖండ్ తరఫున అద్భుత ప్రదర్శనతో మార్చేసే ప్రయత్నం చేశాడు. గతేడాది దక్షిణాఫ్రికా పర్యటనలో ఉండగా మధ్యలోనే స్వదేశానికి వచ్చేశాడు ఇషాన్. 'మానసికంగా ఇబ్బందిపడుతున్నా' అని చెప్పాడు. అయితే ఐపీఎల్ నేపథ్యంలో ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. దీంతో అతని ప్రవర్తనపై బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. జాతీయ జట్టులో లేనప్పుడు దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందే అని తేల్చి చెప్పింది. అయినప్పటికీ ఇషాన్ తీరులో మార్పు రాలేదు. ఇది అతని జాతీయ జట్టు కాంట్రాక్ట్‌ను తొలగింపునకు కారణమైంది. ఇదంతా జరిగిన కొన్ని రోజులకు దేశవాళీ క్రికెట్ ఆడాడు. అడపాదడపా పరుగులు చేస్తూ రాణించినా జాతీయ జట్టు నుంచి పిలుపు రాలేదు. దేశవాళీ ఆడటం ప్రారంభించిన కొన్ని రోజులకు ఇషాన్ సెంట్రల్ కాంట్రాక్ట్ తిరిగొచ్చింది. ఓ సందర్భంలో రిషభ్ పంత్ గాయపడినప్పుడు ఇషాన్‌కి అవకాశం వస్తుంది అనుకున్నారంతా. కానీ ఆ టైమ్‌లో గాయం బారినపడటంతో ఛాన్స్ మిస్సయ్యాడు. ఇప్పుడు SMATలో 517 పరుగులు చేసి టాప్ బ్యాటర్‌గా నిలిచాడు. ఫైనల్‌లో మెరుపు శతకం కూడా సాధించాడు. ఇక ఆటగాడినే కాదు.. నాయకుడిగానూ రాణించాడు. ఎలైట్ దశలో వరుసగా 7 మ్యాచుల్లో గెలిపించాడు. సూపర్ లీగ్‌లో మూడింట రెండు గెలిచి ఫైనల్‌కి తీసుకొచ్చాడు. ఇందులో గెలిస్తే ఝార్ఖండ్‌కి ఇదే తొలి SMAT టైటిల్ కావడం గమనార్హం. బాగా ఆడుతున్న ఓ ప్లేయర్ అనూహ్యంగా జట్టు నుంచి బయటకు రావడం, ఆ తర్వాత బీసీసీఐ ఆగ్రహానికి గురవ్వడం, ఆ వెంటనే కాంట్రాక్ట్ కోల్పోవడం.. తిరిగి దేశవాళీ క్రికెట్‌లోకి వచ్చిన టోర్నీ టాపర్‌గా నిలవడం.. ఇదంతా వినడానికి సినిమా కథలా ఉంది కదా. నిజమే.. ఈ సినిమాలో హీరో ఇషాన్ కిషన్. మరి తిరిగి జాతీయ జట్టులోకి వచ్చి తిరిగి స్టార్ హీరో అవుతాడా? టీ20 ప్రపంచకప్ 2026 జట్టులో స్థానం దక్కించుకుంటాడా? మరికొన్ని రోజుల్లో తేలిపోతుంది.



# పొగమంచుతో మ్యాచ్ రద్దు.. టికెట్ల సొమ్ము రీఫండ్‌పై స్పందించిన బీసీసీఐ

లఖ్‌నవూలోని ఎకానా స్టేడియంలో భారత్, సౌతాఫ్రికా (IND vs SA) మధ్య జరగాల్సిన నాలుగో టీ20 పొగమంచు కారణంగా రద్దయింది. మనుషులు సైతం సరిగా కనిపించలేనంత పొగమంచు ఉండటంతో టాస్ పడకుండానే ఆటను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. చాలా కష్టపడి మ్యాచ్ టిక్కెట్లు కొనుగోలు చేశామని, ఆ నగదు వెనక్కి ఇప్పించాలని ప్రేక్షకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ స్పందించింది. ప్రేక్షకులకు సొమ్మును రీఫండ్‌ని పర్యవేక్షించే పూర్తి అధికారం ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (UPCA) పరిధిలో ఉందని బోర్డు కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా స్పష్టం చేశారు. బీసీసీఐ రీఫండ్ పాలసీ ప్రకారం.. ఒక్క బంతి కూడా పడకుండా మ్యాచ్ రద్దైతే, ప్రేక్షకులకు తిరిగి రీఫండ్ చేయాల్సి ఉంటుంది. 'టికెట్ల జారీ అనేది అంశం రాష్ట్రాల క్రికెట్ సంఘాల పరిధిలో ఉంది. బీసీసీఐ వారికి ఆతిథ్య హక్కులు మాత్రమే ఇస్తుంది. ఈ మ్యాచ్ ఆతిథ్య బాధ్యతలను ఉత్తరప్రదేశ్ క్రికెట్ సంఘం పర్యవేక్షించింది. కాబట్టి, రీఫండ్‌పై వారే సమాధానం చెప్తారు. ఈ విషయంలో పూర్తి బాధ్యత వారిదే' అని బీసీసీఐ కార్యదర్శి సైకియా వెల్లడించారు. లఖ్‌నవూలో తీవ్రమైన పొగమంచుతో మ్యాచ్ రద్దుకావడంపై సైకియా స్పందించారు. సాధారణంగా లఖ్‌నవూలో ఇటువంటి వాతావరణం జనవరిలో ఉంటుందని, ఈ సారి కాస్త ముందుగానే అలాంటి పరిస్థితి ఎదురవడంతో మ్యాచ్‌కు ఆటంకం ఏర్పడిందన్నారు.

# సినిమా

# రిచ్చెస్ట్ హీరోయిన్



బాలీవుడ్‌తో పాటు తెలుగు, తమిళ పరిశ్రమల్లోనూ జూహీ చావ్లా సుపరిచితురాలు. అక్కినేని నాగార్జున సరసన విక్కీ దాదా చిత్రంలో జూహీ నటించింది. బాలీవుడ్‌లో పలు బ్లాక్ బస్టర్ సినిమాల్లో నటించిన ఆమె నిర్మాతగా మారి పలు సినిమాలు నిర్మించింది. అదే విధంగా షారూక్‌ఖాన్‌తో కలిసి ఐపీఎల్ లో కోల్ కతా నైట్ రైడర్స్ జట్టుపై పెట్టుబడులు పెట్టింది. ఈ పెట్టుబడులు ఆమెను దేశంలో రిచ్చెస్ట్ సెలబ్రిటీగా మార్చాయి. హరూన్ ఇండియా సర్వే ప్రకారం భర్త ఆస్తులతో కలిపి జూహీ చావ్లా నికర ఆస్తుల విలువ రూ.7,790 కోట్లు. 2024 నాటికి ఈ ఆస్తుల విలువ రూ.4600 కోట్లుగా ఉండేది. ఒక్క ఏడాదిలోనే రూ.3,190కోట్ల సంపదల్ని ఈ జంట అదనంగా జోడించింది. రకరకాల వ్యాపారాల నుండి ఈ జంట భారీగా ఆర్జిస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీకి షారూఖ్ తో జూహీ భర్త మెహతా సహ యజమాని. ఖాన్ రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్ తోను జూహీ అనుబంధం కలిగి ఉంది. జూహీ చావ్లా జే మెహతా జంట రియల్ ఎస్టేట్ రంగంలోను సుప్రసిద్ధులు. గత 15ఏళ్లలో ఆమెకు అసలు సినిమాలే లేవు. కానీ తన భర్త తో కలిసి లాభసాటి వ్యాపారాల్లో తలమునకలుగా ఉంది.

# కాంబో కంటిన్యూ..

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ ప్రత్యేకతే వేరు. వీరిద్దరి కలయికలో రూపొందిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించాయి. బాలయ్య కెరీర్‌లో అత్యధిక వసూళ్లని రాబట్టిన సినిమాలుగా నిలిచాయి. సింహా, లెజెండ్, అఖండ వీరిద్దరి కలయికలో వచ్చిన హ్యాట్రిక్ హిట్ మూవీలు. తాజాగా వీరి కాంబినేషన్‌లో అఖండ కు సీక్వెల్‌గా రూపొందిన అఖండ 2 డిసెంబర్ 12న విడుదలై డివైడ్ టాక్‌ని సొంతం చేసుకుంది. అయితే ఇది థియేటర్లలో ఉండగానే బోయపాటి, బాలయ్య కాంబినేషన్‌లో మరో సినిమాకు రంగం సిద్ధమవుతోందనే వార్త టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు మొదలయ్యాయని ఇన్ సైడ్ టాక్. ఈ భారీ క్రేజీ ప్రాజెక్ట్‌ని ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ సెట్స్ పైకి తీసుకెళ్లబోతోందట. చాలా కాలంగా పెడింగ్‌లో ఉన్న బాలయ్య గీతా ఆర్ట్స్ కాంబినేషన్ ఇప్పుడు పట్టాలెక్కబోతోందనే వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.



# ఫ్యాన్స్‌తో పాట్లు

డార్లింగ్ ప్రభాస్ ప్రధాన పాత్రలో టి.జి. విశ్వప్రసాద్, కృతిప్రసాద్ కలిసి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మించిన మూవీ ది రాజాసాబ్. ఇందులో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్రని పోషించాడు మారుతి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.

దీం తో

ఇందులోని 'సహనా సహనా నా సఖి సహనా... కలలో నిన్నే చూశానా' అంటూ సాగే పాటని నిన్న రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన హీరోయిన్‌నిధి అగర్వాల్‌ఫ్యాన్స్ వల్ల అసౌకర్యానికి గురయ్యింది. పాట లాంచ్ తర్వాత ఆమె తిరిగి తన కారు వద్దకు వెళ్లే సమయంలో వందల మంది అభిమానులు నిధి వద్దకు వచ్చారు. సెల్ఫీల కోసం ఎగబడ్డారు కొందరు ఆమెను తాకేందుకు ప్రయత్నించారు. హీరోయిన్‌బాడీగార్డులు అందరినీ కంట్రోల్ చేసి క్షేమంగా కారు ఎక్కించడంతో ఆమె ఊరిపి పీల్చుకుంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. పలువురు సెలబ్రిటీలు ఫైర్ అవుతున్నారు.



## ఓటీటీలోకి రొమాంటిక్ డ్రామా మూవీ..

### హిట్ సినిమా స్ట్రీమింగ్ ఎప్పుడంటే?




బాక్సాఫీసు వద్ద విజయాన్ని అందుకున్న మరో సినిమా ఓటీటీలోకి రానుంది. రూ.100 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టిన ఆ చిత్రం డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. అదే 'ఏక్ దీవానే కీ దీవానియత్'. హర్షవర్ధన్ రాణే, సోనమ్ బజ్వా జంటగా దర్శకుడు మిలాప్ జవేరి తెరకెక్కించిన చిత్రమిది. 'జీ 5' లో ఈ నెల 26 నుంచి స్ట్రీమింగ్ కానుంది. విక్రమాదిత్య భోస్లే (హర్షవర్ధన్ రాణే) రాజకీయ నాయకుడు. అదా (సోనమ్ బజ్వా) బాలీవుడ్ నటి. తొలి చూపులోనే అదాను ఇష్టపడతాడు. కానీ, అతడి ప్రవర్తన ఆమెకు నచ్చదు. ఇద్దరి మనస్తత్వాలు వేర్వేరు కావడమే అందుకు కారణం. అదాకు నచ్చే విధంగా విక్రమాదిత్య తనను తాను మార్చుకున్నాడా? ఆమెను పెళ్లి చేసుకున్నాడా? అన్నది ఈ సినిమా కథాంశం. మ్యూజికల్‌గానూ ఈ మూవీ హిందీ ఆడియన్స్‌ను ఆకట్టుకుంది.

## తెరపైకి అజిత్ రేసింగ్ లైఫ్.. వెల్లడించిన దర్శకుడు




ప్రముఖ నటుడు అజిత్ ప్రొఫెషనల్ రేసర్ అనే సంగతి తెలిసిందే. ఆయన టీమ్‌కు అంతర్జాతీయంగా మంచి క్రేజ్ ఉంది. అసలు అజిత్‌కు మోటార్ రేసింగ్‌పై ఎప్పుడు ఆసక్తి కలిగింది? యాక్టర్‌గా బిజీగా ఉన్నప్పటికీ రేసింగ్‌లో అంత యాక్టివ్‌గా ఎలా ఉండగలుగుతున్నారు? ఇలాంటి ఎన్నో ఆసక్తికర అంశాలతో ఓ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. అజిత్ రేసింగ్ కెరీర్‌ను తెరపైకి తీసుకురానున్నట్లు దర్శకుడు ఎ.ఎల్. విజయ్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అజిత్ రేసింగ్ ప్రపంచంలో తాను ఓ భాగం కానుండటం ఆనందంగా ఉందన్నారు. అయితే, అది సినిమానా, డాక్యుమెంటరీనా? అనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. ఈ ఏడాది 'విదాముయార్చి' (తెలుగులో పట్టుదల), 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాలతో ప్రేక్షకులను అలరించారు అజిత్. తదుపరి సినిమాని ఇంకా ప్రకటించలేదు. రేసింగ్‌లో అజిత్ టీమ్.. దుబాయ్‌లో జరిగిన 24హెచ్‌లో మూడో స్థానం, ఇటలీలో నిర్వహించిన 12హెచ్‌లో మూడో స్థానం, బెల్జియంలో నిర్వహించిన స్పా ఫ్రాన్‌కోర్‌ఛాంప్స్ సర్క్యూట్‌లో రెండో స్థానంలో నిలిచింది.

## 'ఛావా' టార్చర్ సీన్.. అనుకున్నంత సులభం కాదు

**: విక్కీ కౌశల్**

బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ , రష్మిక జంటగా నటించిన చిత్రం 'ఛావా'. భారీ విజయాన్ని అందుకున్న ఈ సినిమాలో క్లైమాక్స్ హైలైట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. తాజాగా ఆ సన్నివేశం గురించి విక్కీ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆ సీన్ షూట్ చేస్తున్నప్పుడు తాను గాయపడినట్లు తెలిపారు. శంభాజీ మహారాజ్‌ను బంధించి చిత్రహింసలు పెట్టే సన్నివేశం సినిమాలో ఎంతో కీలకంగా ఉంటుంది. ఈ టార్చర్ సీన్ గురించి విక్కీ పంచుకున్నారు. ''ఆ సన్నివేశాల షూటింగ్ ప్రారంభించిన తర్వాత మూడో రోజు నేను గాయపడ్డాను. దీంతో నెలన్నర విరామం తీసుకోవాల్సి వచ్చింది. ఆ సీన్ కోసం వేసిన సెట్‌ను కూడా తీసేశాం. 2 నెలల తర్వాత మళ్లీ సెట్ వేశాం. 12 రోజుల పాటు దాన్ని రూపొందించాం. అలాంటి సన్నివేశాలు తెరకెక్కించడం అనుకున్నంత సులభం కాదు. ప్రతిఒక్కరూ వందశాతం కష్టపడ్డారు. శంభాజీ మహారాజ్ గురించి ప్రపంచానికి చెప్పాలని అంత శ్రమపడి దాన్ని రూపొందించాం'' అని విక్కీ చెప్పారు.

# 'అవతార్ 3'పై సుకుమార్ రివ్యూ..

సినీ దర్శకుల్లో జేమ్స్ కామెరూన్ ఓ అవతార్ అయితే.. మిగతా వారమంతా మానవమాత్రులమేనని దర్శకుడు సుకుమార్ అన్నారు. 'అవతార్..' ఈ సినిమాతో యావత్ సినీ ప్రపంచాన్ని దర్శకుడు జేమ్స్ కామెరూన్ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. ఇప్పుడు దీని మూడో భాగం ప్రేక్షకులను మైమరపించేందుకు సిద్ధమైంది. డిసెంబర్ 19న 'అవతార్: ఫైర్ అండ్ యాష్' విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా కొంత మంది సినీ ప్రముఖులకు 'అవతార్ 3'ని చూపించారు. వారిలో సుకుమార్ కూడా ఉన్నారు. తాజాగా ఆయన ఈ మూవీ గురించి మాట్లాడారు. ఇది చూసి మరో ప్రపంచానికి వెళ్లినట్లు తెలిపారు. ''ఈ స్టోరీని ఇలా చెప్పడం చాలా కష్టమైన విషయం. కుటుంబమంతా కలిసి చూసే చిత్రమిది. 3.17 గంటలు నాకు క్షణాల్లా అయిపోయాయి. పండోర ప్రపంచానికి వెళ్లిపోయాను. నా చుట్టూ ఎవరు ఉన్నారు అనేది కూడా తెలియలేదు. కచ్చితంగా ఇది బ్లాక్‌బస్టర్ అవుతుంది. తెలుగు సినిమాల్లో ఉన్నన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఆ విజువల్స్, పాత్రలు నా మైండ్‌లో నుంచి వెళ్లలేదు. కొన్ని సన్నివేశాల్లో భావోద్వేగంతో కళ్లలో నీళ్లు వచ్చాయి. సినిమా అంటే ఇదీ అనిపించింది. జేమ్స్ కామెరూన్ సినిమాలను మనం థియేటర్‌లో చూస్తేనే ఎంజాయ్ చేయగలం'' అని సుకుమార్ చెప్పారు. ఇంత గొప్ప చిత్రాన్ని అందించినందుకు జేమ్స్ కామెరూన్‌కు సుకుమార్ ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ చిత్ర పరిశ్రమలో 'అవతార్' ఓ సంచలనం. పండోర అనే కల్పిత గ్రహాన్ని సృష్టించి అందులోని ప్రకృతి అందాలను కళ్లు చెదిరే విజువల్ ఎఫెక్ట్స్‌తో అందరినీ కట్టిపడేశారు దర్శకుడు. ఆ తర్వాత 'అవతార్: ది వే ఆఫ్ వాటర్'తో మంచి ట్రీట్ ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 160 భాషల్లో విడుదలైన ఆ సీక్వెల్ బాక్సాఫీసు కలెక్షన్లను కొల్లగొట్టింది. ఆ ఫ్రాంచైజీలో మూడో భాగాన్ని పంచభూతాల్లో ఒకటైన అగ్నికి సంబంధించిన కాన్సెప్ట్‌తో రూపొందించారు.



# కాంగ్రెస్ పార్టీ ధర్నాలో పాల్గొన్న చిగిరింత పారిజాత రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 18 (భారత శక్తి): రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసు పేరుతో కాంగ్రెస్ పార్టీ అధినేతలు శ్రీమతి సోనియా గాంధీని, రాహుల్ గాంధీని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ పూర్వకంగానే తప్పుడు కేసులు పెట్టారని అన్నారు. నిన్న కోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీకి చెంప పెట్టు అని అన్నారు. ఆధారాలు లేని కేసుతో కాలయాపన చేసి కాంగ్రెస్ పార్టీని ప్రజల నుండి దూరం చేసే కుట్ర బీజేపీ పార్టీ చేసిందని అందుకు న్యాయం ఎప్పుడైన, ఎక్కడైనా గెలుస్తుందని కోర్టు ద్వారానే నిరూపణ జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు, టీయూఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాష్ట్ర రోడ్లు డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఐఎన్ టియూసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనితా రెడ్డి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జగదీశ్వర్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





కొత్తపేట్ రాజధాని గార్డెన్స్ లో స్పెషల్ ఇన్సెంటివ్ రెవిషన్ (ఎస్ఐఆర్) అమలు అంశంపై సమగ్ర చర్చ కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్ ప్రసంగంపై నిర్వహించిన ప్రత్యేక చిత్ర ప్రదర్శన కార్యక్రమానికి తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్ర రావు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, అలె భాస్కర్,సామ రంగారెడ్డి బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, విష్ణువర్ధన్ రావు హాజరై ప్రత్యేక ప్రదర్శనను తిలకించడం జరిగింది.

ఎల్బీనగర్, డిసెంబర్ 18 (భారత శక్తి ):

# రామోజీ ఫిల్మ్ సిటీ పరిధిలో ఉపరితల ప్రాంతం నిషిద్ధం

రాచకొండ, డిసెంబర్ 18 (భారత శక్తి): భారత రాష్ట్రపతి, భారత ఉపరాష్ట్రపతి రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్ లోని ప్రసిద్ధ రామోజీ ఫిల్మ్ సిటీని శుక్రవారం, శనివారం అంటే రెండు రోజులు సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రదేశాన్ని సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ కింద నోఫ్లై /నోడ్రోన్ జోన్ను ప్రకటించారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం, రాచకొండ కమిషనరేట్ నోటిఫైడ్ లిమిట్స్ ఏరియాలో డ్రోన్లు, యుఏవిలు, రిమోట్లీ పైలట్ ఎయిర్క్రాఫ్ట్ సిస్టమ్స్ , పారాగ్లైడర్లు,




బెలూన్లు, మైక్రోలైట్ ఎయిర్క్రాఫ్ట్ మరే ఇతర ఎగిరే వైమానిక వస్తువులను ఎగరవేయడం నిషేధించబడింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సందర్శన ఉన్నందున భద్రతను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండడానికి ఆ ప్రదేశాన్ని సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ కింద నో ఫ్లై, నో డ్రోన్ ఫ్లై ఏరియాగా ప్రకటించడం జరిగిందని రాచకొండ సిపి సుధీర్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ప్రజాపాలనకు ఎస్ఐఆర్ కీలకం

: **బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

ఎల్బీనగర్, డిసెంబర్ 18 (భారత శక్తి): సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగడంతోపాటు సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా ఎస్ఐఆర్ అమలు చేయబడుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు అన్నారు. ఎస్ఐఆర్ అమలు అంశంపై సమగ్ర చర్చ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా పార్లమెంట్ ప్రసంగంపై ప్రత్యేక చిత్ర ప్రదర్శన కొత్తపేట్ డివిజన్ లోని రాజధాని గార్డెన్స్ లో గురువారం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై అయన మాట్లాడారు. ఎస్ఐఆర్ అమలు ద్వారా ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం కింద ప్రభుత్వ



సేవలను వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు చేరవేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనుల అమలును సమర్థవంతంగా చేయడం, ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబుని కలిసిన మధుయాష్కి గౌడ్

* **ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కోసం వినతి**

ఎల్బీనగర్, డిసెంబర్ 18 (భారత శక్తి): టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గురువారం బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుని కలిశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంత్రితో చర్చించారు. పలు కాలనీలు బస్తీలలో చేపట్టాల్సిన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్లు, కమ్యూనిటీ హాల్స్, తదితర అభివృద్ధి పనులపై వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా జిహెచ్ఎంసి పునర్విభజనలో భాగంగా డివిజన్ల విభజన, నూతన డివిజన్ల ఏర్పాటు, వాటి పేర్లు తదితర అంశాలపైనా చర్చించారు. ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలను పరిణలలోకి తీసుకొని పరిష్కారం చూపాలని కోరారు.



# కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

* **ముట్టడికి యత్నించిన కాంగ్రెస్**
* **కాంగ్రెస్ , బిజెపి శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం.. హోరా హోరీగా నినాదాలు**
* **బిజెపి శ్రేణులను... అడ్డుకున్న పోలీసులు.. నేతల అరెస్ట్**
* **కాంగ్రెస్ తీరు పై బిజెపి నేతలు మండిపాటు**

కరీంనగర్, డిసెంబర్ 18 (భారతశక్తి ప్రతినిధి): కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం వద్ద గురువారం రోజున ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కరీంనగర్ కాంగ్రెస్ శ్రేణులు పార్లమెంట్ కార్యాలయాన్ని ముట్టడించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బిజెపి , కాంగ్రెస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది . ఇరు పార్టీలు హోరా హోరీగా నినాదాలు చేశారు. అనంతరం కరీంనగర్ కాంగ్రెస్ కార్యాలయ ముట్టడికి బిజెపి శ్రేణులు బయలుదేరడం తో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి కాంగ్రెస్ , బిజెపి నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు మాజీ




మేయర్ , యాదగిరి సునీల్ రావు, పార్లమెంటు కన్వీనర్ బోయిన్ పల్లి ప్రవీణ్ రావు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్‌లు కాంగ్రెస్ వ్యవహరించిన తీరుపై మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో చట్టం తన పని తాను చేసుకోపోయిందనే విషయాన్ని కాంగ్రెస్ గుర్తించాలన్నారు. బిజెపి ప్రతీకార రాజకీయాలు చేస్తుందని కాంగ్రెస్ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసు 2008 ప్రారంభమైందని , ఆ సమయంలో కేంద్రంలో మోడీ ప్రభుత్వం లేదనే విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు బిజెపిపై చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నవేనన్నారు. కాంగ్రెస్ ఈ కేసును రాజకీయ రంగు పులిమీ లబ్ది పొందాలనుకోవడం. మూర్ఖత్వం అన్నారు. డూప్లికేట్ గాంధీ వారసులకు మద్దతిచ్చే నాయకులకు సిగ్గుండాలన్నారు. బిజెపితో ఇలాంటి రాజకీయ ఆటలాడితే తగిన గుణపాఠం చెబుతామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.



## బీజేపీ కక్ష సాధింపు చర్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకుల ధర్నా

షాద్ నగర్, డిసెంబర్ 18 (భారత శక్తి): ఏఐసీసీ ఆదేశాల మేరకు టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపుతో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో నేషనల్ హెరాల్డ్ కేసులో రాజకీయ కక్ష సాధింపుతో శ్రీమతి సోనియా గాంధీ రాహుల్ గాంధీల మీద కక్ష సాధింపు చర్యలకు నిరసనగా చేపట్టిన కార్యక్రమంలో రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి పాల్గొని నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర ఉద్యమ సమయంలో కాంగ్రెస్ గొంతుకగా కీలక పాత్ర పోషించిన నేషనల్ హెరాల్డ్ పత్రికలో నిరాధారమైన కేసులను పెట్టి, ఆదాని,అంబానీ విషయంలో ప్రశ్నిస్తున్నందుకు కక్ష సాధింపుగానే కేసులు పెడుతున్నారని, రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీనే ప్రధానమంత్రి అవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో షాద్నగర్ ఎమ్మెల్యే శంకరయ్య పీసీసీ జనరల్ సెక్రెటరీ జగదీష్ గౌడ్ మాజీ మేయర్ పారిజాతం మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ అనిత రెడ్డి ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సదా లక్ష్మీ, అన్నా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ, మండల ప్రెసిడెంట్స్, కార్పొరేటర్లు, నూతనంగా ఎన్నికైన వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చౌళ్ళపెల్లి ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా..

* **గ్రామ నూతన సర్పంచ్ మోరే రాజేశ్వరరావు**

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి) డిసెంబర్18: నాపై నమ్మకం ఉంచి, తనను గెలిపించిన చౌళ్ళపెల్లి బిఆర్ఎస్, బిజెపి పార్టీ పెద్దలకు, నాయకులకు, గ్రామస్తులకు చౌళ్ళపెల్లి నూతన గ్రామ సర్పంచ్ మోరే రాజేశ్వరరావు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈనెల 17న మూడవ విడత ఎన్నికల్లో భాగంగా.., జరిగిన సర్పంచ్ ఎన్నికలలో బిఆర్ఎస్ అలవెన్స్ చౌళ్ళపెల్లి సర్పంచ్ అభ్యర్థి మోరే రాజేశ్వరరావు సర్పంచ్ గా ఘన విజయం సాధించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పూజారి కుమారస్వామి ఉప సర్పంచ్ గా ఎన్నికయ్యారు. సర్పంచ్ గా విజయం సాధించిన మోరే రాజేశ్వరరావును గ్రామస్తులు, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నేతలు, నాయకులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ సర్పంచ్ రాజేశ్వరరావు మాట్లాడుతూ చౌళ్ళపెల్లి గ్రామంలో మౌలిక



వసతులు మెరుగుపరిచి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని, ఈ సందర్భంగా ఈ సర్పంచ్ పదవి కాలంలో గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటానని, గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరిచి, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తానని సర్పంచ్ రాజేశ్వరరావు అన్నారు. అదే విధంగా తనను ఉపసర్పంచ్ గా ఎన్నుకున్న వార్డు మెంబర్లకు ఉప సర్పంచ్ పూజారి కుమారస్వామి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డ్ మెంబర్ కుక్కముడి కిరణ్ కుమార్, మిగతా వార్డ్ మెంబర్లు, బిఆర్ఎస్, బిజెపి నాయకులు, వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు, యువ నాయకులు, గ్రామ కమిటీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం మాయమవుతుంది.. అందరికీ అధిక ఆదాయం వస్తుంది

డిసెంబర్ 18 (భారత శక్తి): ప్రపంచ కుబేరుడు, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో ప్రజలు డబ్బు ఆదా చేసుకోవాల్సిన అవసరమే ఉండదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో 'యూనివర్సల్ హై ఇన్‌కమ్' (అందరికీ అధిక ఆదాయం) అందుబాటులోకి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. అమెరికాలో ప్రవేశపెట్టిన 'ట్రంప్ అకౌంట్స్' పథకంపై బిలియనీర్ ఇన్వెస్టర్ రే డాలియో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ మస్క్ ఈ విధంగా పేర్కొన్నారు. ఏఐ, రోబోటిక్స్ రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పుల వల్ల పేదరికం పూర్తిగా తొలగిపోతుందని, సంప్రదాయ ఉద్యోగాల అవసరం కూడా తగ్గుతుందని మస్క్ చాలాకాలంగా చెబుతున్నారు. ఇదే విషయాన్ని పునరుద్ఘాటిస్తూ, "భవిష్యత్తులో పేదరికం అనేదే ఉండదు. కాబట్టి డబ్బు ఆదా చేయాల్సిన అవసరం రాదు. అందరికీ అధిక ఆదాయం ఉంటుంది" అని ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. ఉత్పాదకత విపరీతంగా పెరిగితే, గాలి మాదిరిగానే డబ్బే అసంబద్ధంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, మస్క్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 600 బిలియన్ డాలర్ల సంపద కలిగిన వ్యక్తి, ఇతరులకు డబ్బు దాచుకోవద్దని సలహా ఇవ్వడం విడ్డూరంగా ఉందని పలువురు నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. "అన్నీ ఉచితంగా లభిస్తే, వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఎవరికి ప్రోత్సాహం ఉంటుంది?" అని ఒకరు ప్రశ్నించగా, "అందరికీ ఆదాయం వచ్చినా, 'అధిక ఆదాయం' అనే నిర్వచనం ఎప్పటికప్పుడు మారుతూనే ఉంటుంది" అని మరొకరు అభిప్రాయపడ్డారు. ఇటీవలే ఎలాన్ మస్క్ సంపద 600 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటినట్లు ఫోర్బ్స్ ప్రకటించింది. ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. తన స్పేస్‌ఎక్స్ స్టార్టప్ విలువ 800 బిలియన్ డాలర్లకు చేరవచ్చన్న నివేదికల నేపథ్యంలో ఆయన సంపద గణనీయంగా పెరిగింది.

**ఏమిటీ 'ట్రంప్ అకౌంట్స్'?**

'ట్రంప్ అకౌంట్స్' అనేది అమెరికాలో కొత్తగా ప్రవేశపెట్టిన ఒక ఫెడరల్ పథకం. దీని కింద, కొత్తగా పుట్టిన పిల్లల పేరుపై తల్లిదండ్రులు ఖాతా తెరిస్తే, ప్రభుత్వం ఒకేసారి $1,000 జమ చేస్తుంది. ఈ మొత్తాన్ని స్టాక్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టి, పిల్లలకు 18 ఏళ్లు వచ్చేసరికి ఆర్థికంగా భరోసా కల్పించడం దీని లక్ష్యం.

# 2 గంటలకు బాంబు పేలుతుంది

హైదరాబాద్, డిసెంబర్ 18 (భారత శక్తి): హైదరాబాద్ నగరంలోని నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటలకు కోర్టు ప్రాంగణంలో బాంబు పేలుతుందని ఆ సందేశంలో పేర్కొన్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులను కోర్టు నుంచి బయటకు పంపించి, బాంబు నిర్వీర్య దళాలతో తనిఖీలు చేపట్టారు. కోర్టు లోపల, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చిన ఈ బెదిరింపు సందేశంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోర్టు ప్రాంగణంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# రష్యా సైన్యంలో 202 మంది భారతీయులు..

రష్యా, డిసెంబర్ 18 : రష్యా సైన్యంలో 2022 నుంచి ఇప్పటివరకు 202 మంది భారతీయులు చేరారని, వారిలో 26 మంది మరణించగా, మరో ఏడుగురు గల్లంతయ్యారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇవాళ రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే, కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ వివరాలు తెలిపారు. భారత్ చేపట్టిన దౌత్యపరమైన చర్యల ఫలితంగా ఇప్పటివరకు 119 మందిని రష్యా సైన్యం నుంచి విడిపించి వెనక్కి తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. మరో 50 మంది భారతీయులు ఇంకా విడుదల కోసం ఎదురుచూస్తున్నారని, వారి భద్రత, సంక్షేమం, వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తెలిపారు. యుద్ధంలో మరణించిన 26 మందిలో 10 మంది మృతదేహాలను భారత్‌కు తరలించినట్లు ప్రభుత్వం ధృవీకరించింది. మరో ఇద్దరి అంత్యక్రియలు భారత రాయబార కార్యాలయం సహాయంతో రష్యాలోనే స్థానికంగా పూర్తి చేసినట్లు పేర్కొంది. మరణించిన లేదా గల్లంతైన వారిలో కొందరిని గుర్తించేందుకు, 18 మంది భారతీయుల కుటుంబ సభ్యుల డీఎన్‌ఏ నమూనాలను రష్యా అధికారులతో పంచుకున్నట్లు మంత్రి తెలిపారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం, సైన్యం నుంచి విడుదలైన వారికి ప్రయాణ పత్రాలు, విమాన టిక్కెట్లు, ఇతర లాజిస్టికల్ మద్దతు అందిస్తోందని ప్రభుత్వం తెలిపింది. ఈ అంశాన్ని ఇరు దేశాల నేతలు, మంత్రులు, ఉన్నతాధికారుల మధ్య జరిగిన పలు సమావేశాల్లో ప్రస్తావించినట్లు చెప్పింది. మిగిలిన భారతీయులందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే వరకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయని పార్లమెంటుకు హామీ ఇచ్చింది.

## విచారణలో నోరు విప్పిన ఐబొమ్మ రవి..
# పైరసీ ఎలా చేశాడో చెప్పేశాడు!

హైదరాబాద్, డిసెంబర్ 18 (భారత శక్తి): ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు రవి కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసుల విచారణలో అతడు సినిమా పైరసీకి పాల్పడిన విధానాన్ని వెల్లడించాడు. టెలిగ్రామ్ ఛానల్ ద్వారా కొత్త సినిమాల పైరసీ ప్రింట్లతో వ్యాపారం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈరోజు జరిగిన విచారణలో పైరసీకి సంబంధించిన కీలక వివరాలను రవి వెల్లడించాడు. కేవలం సాధారణ ప్రింట్లే కాకుండా, ఏకంగా క్యూబ్ నెట్‌వర్క్‌ను, శాటిలైట్ లింక్‌ను హ్యాక్ చేసి సినిమాలను హెచ్‌డీ ఫార్మాట్‌లో రికార్డు చేసినట్లు తెలిపాడు. ఈ విధంగా పైరసీ చేసిన సినిమాలను అమ్మేందుకు 'హెచ్‌డీ హబ్' పేరుతో ప్రత్యేకంగా ఒక టెలిగ్రామ్ ఛానల్ ఏర్పాటు చేసినట్లు చెప్పాడు. ఈ ఛానల్‌లో పైరసీ లింకులను అప్‌లోడ్ చేసి, ఒక్కో లింక్‌కు 100 నుంచి 300 డాలర్ల వరకు వసూలు చేసినట్లు స్పష్టం చేశాడు. ముఖ్యంగా 'హిట్ 3', 'కిష్కింధపురి' సినిమాలను శాటిలైట్ లింక్ ద్వారానే పైరసీ చేసినట్లు అంగీకరించాడు. ఈ నేపథ్యంలో, మూడు వేర్వేరు కేసుల్లో విచారణ నిమిత్తం నాంపల్లి కోర్టు ఇమ్మడి రవికి 12 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం చంచల్‌గూడ జైలు నుంచి అతడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

# ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం..



ఒమన్, డిసెంబర్ 18 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం. అంతకుముందు, ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (CEPA) కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'మైత్రీ పర్వ్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, ఇండియా ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని, ఒమన్ వ్యాపారవేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.



# వెండి పరుగులు.. బంగారం నిలకడ..
## మార్కెట్‌లో మిశ్రమ ట్రెండ్!

* **దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల మిశ్రమ స్పందన**
* **కిలో వెండి ధర రూ.2 లక్షల మైలురాయిని దాటేసింది**
* **స్పాట్ మార్కెట్‌లో పెరిగి, ఫ్యూచర్స్‌లో తగ్గిన పసిడి ధరలు**
* **అంతర్జాతీయంగానూ బంగారం, వెండి ధరలు డౌన్**
* **లాభాల స్వీకరణతో ధరల్లో ఒడుదొడుకులు అంటున్న నిపుణులు**

ఢిల్లీ, డిసెంబర్ 18 (భారత శక్తి): గురువారం దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మిశ్రమంగా కదలాడాయి. స్పాట్ మార్కెట్‌లో బంగారం ధర స్వల్పంగా పెరిగితే, వెండి మాత్రం రికార్డు స్థాయిలో దూసుకెళ్లింది. ఏకంగా కిలో వెండి ధర రూ.2 లక్షల కీలక మైలురాయిని దాటింది. అయితే, ఫ్యూచర్స్ మార్కెట్, అంతర్జాతీయ మార్కెట్లలో మాత్రం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇండియా బులియన్ జ్యువెలర్స్ అసోసియేషన్ (IBJA) గణాంకాల ప్రకారం, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.157 పెరిగి రూ.1,32,474 వద్ద స్థిరపడింది. అదేవిధంగా 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,21,346కి చేరింది. మరోవైపు వెండి ధర మాత్రం కిలోపై రూ.1,479 పెరిగి రూ.2,01,120 పలికింది. దీంతో దేశీయ మార్కెట్‌లో వెండి సరికొత్త రికార్డును నమోదు చేసింది. దీనికి విరుద్ధంగా, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో ధరలు తగ్గాయి. ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్ట్ 0.50 శాతం క్షీణించి రూ.1,34,218కి చేరగా, మార్చి సిల్వర్ కాంట్రాక్ట్ 1.19 శాతం తగ్గి రూ.2,04,961 వద్ద ట్రేడ్ అయింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్సు బంగారం ధర 0.34 శాతం తగ్గి 4,357 డాలర్ల వద్ద, వెండి ధర ఒక శాతం తగ్గి 66.24 డాలర్ల వద్ద కదలాడింది. ఇటీవలి భారీ ర్యాలీ తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఫ్యూచర్స్ మార్కెట్‌లో ధరలు తగ్గాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం పసిడి, వెండి ధరలు స్థిరీకరణ దశలో ఉన్నాయని, రాబోయే ప్రపంచ ఆర్థిక డేటా ఆధారంగా తదుపరి మార్పులు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

# కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరు..
## ఆయనతో ప్రయోజనం లేదని గజ్వేల్ ప్రజలకు అర్థమైంది


హైదరాబాద్, డిసెంబర్ 18 (భారత శక్తి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరని, అందుకే ఆయనతో ఎలాంటి ప్రయోజనం లేదని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు ఇచ్చారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని ఆయన అన్నారు. 12 వేలకు పైగా గ్రామపంచాయతీల్లో 7,500కు పైగా కాంగ్రెస్ విజయం సాధించిందని తెలిపారు. కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఒక్క ఎన్నికను కూడా గెలవలేదని ఆయన విమర్శించారు. హరీశ్ రావు నాయకత్వం మార్చాలని చూస్తున్నారని, అందుకే కేటీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ గురించి ఆలోచించడం లేదని అన్నారు. స్పీకర్ నిర్ణయాలు నచ్చకపోతే కోర్టులు ఉన్నాయని, అక్కడికి వెళ్లవచ్చని సూచించారు. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో మూడు రోజులు చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. 12,702 పంచాయతీలకు 7,527 చోట్ల కాంగ్రెస్, 808 చోట్ల కాంగ్రెస్ రెబల్స్ గెలుపొందారని వెల్లడించారు. 66 శాతం ఫలితాలు కాంగ్రెస్, రెబల్స్ సాధించారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఈ ఎన్నికల్లో ఒక కూటమిగా పోటీ చేస్తే, బీఆర్ఎస్ పార్టీకి 3,511, బీజేపీకి 710 స్థానాలు వచ్చాయని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించినట్లుగా అర్థమైందని అన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగితే 87 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందని అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను తాము పాటిస్తామని, ప్రతిపక్షాలకు మాత్రం ఇంకా అహంకారం తగ్గలేదని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలు ఈ విజయానికి కారణమని అన్నారు.

# మా ఇంట్లో ముగ్గురికి అవార్డులు..

అమరావతి, డిసెంబర్ 18 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తన కుటుంబ సభ్యులపై చేసిన ఓ సరదా వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తన తండ్రి, తల్లి, భార్య వరుసగా ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవడంతో, వారితో పోటీపడటం ఏ ఎన్నికల కన్నా కష్టంగా ఉందని ఆయన చమత్కరించారు. వివరాల్లోకి వెళితే, ముఖ్యమంత్రి చంద్రబాబుకు 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ 2025' పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో లోకేశ్ స్పందిస్తూ, "నాన్న 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు గెలుచుకున్నారు. అమ్మ 'గోల్డెన్ పీకాక్' అవార్డును ఇంటికి తీసుకొచ్చారు. నా భార్య దేశంలోనే 'అత్యంత శక్తిమంతమైన వ్యాపారవేత్తల్లో' ఒకరిగా నిలిచారు. ఈ కుటుంబంతో పోటీ పడటం ఏ ఎన్నికల కన్నా కష్టమని నేను తెలుసుకుంటున్నాను!" అని తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు.

# సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక అవార్డు...
## అభినందించిన పవన్ కల్యాణ్

* **చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం**
* **ది ఎకనామిక్ టైమ్స్ అవార్డుపై అభినందనలు తెలిపిన పవన్ కల్యాణ్**
* **చంద్రబాబును దార్శనిక నేతగా అభివర్ణించిన ఏపీ డిప్యూటీ సీఎం**
* **ఆయన కృషితోనే స్వర్ణాంధ్ర 2047 సాధ్యమన్న పవన్**



విజయవాడ, డిసెంబర్ 18 (భారత శక్తి): ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది ఎకనామిక్ టైమ్స్' అందించే ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం ఏపీ సీఎం చంద్రబాబుకు లభించడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చంద్రబాబును ఒక దార్శనిక నేతగా పవన్ కల్యాణ్ అభివర్ణించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, ఐటీ, గ్రీన్ ఎనర్జీ రంగాలను ప్రోత్సహించడం, పాలనలో సంస్కరణలు తీసుకురావడంలో ఆయన చూపిన చొరవ, కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనకు మార్గం సుగమం చేస్తున్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో పయనించేందుకు చంద్రబాబు చేస్తున్న కృషికి మరింత శక్తి చేకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ తన సందేశంలో తెలిపారు. ఆయన మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు.

# బీ.ఆర్.ఎస్ పాలనలో నరకం చూశారు...

- కాంగ్రెస్ పాలనలోనైనా సర్దుకుంటుందా..?
- తెలంగాణ సర్పంచుల గోడు.. వినేవారెవ్వరు..?
- అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించక అప్పులపాలైన ఎంతోమంది సర్పంచ్ లు..
- అవమానాలు భరించలేక ఉసురు తీసుకున్న సంఘటనలు..
- గ్రామాల అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీది సానుకూల వైఖరి..
- ఇప్పటికైనా పట్టుకొమ్మల పరిస్థితిలో మార్పు వస్తుందని నమ్మకం..
- రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతాడా..?
- చరిత్రహీనుడిగా మిగిలిపోతాడు..?
- సర్పంచుల అంతులేని వ్యథలపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ" అందిస్తున్న ప్రత్యేక కథనం..







**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, డిసెంబర్ 18 (భారత శక్తి ) :** సర్పంచ్ ల దారుణమైన ఈ దుస్థితికి ప్రధాన కారణం.. బీ.ఆర్.ఎస్ ప్రభుత్వపు కేంద్రీకృత పాలన, అధికార దుర్వినియోగం, ఆర్థిక అణచివేత.

*** బీ.ఆర్.ఎస్ హయాంలో సర్పంచ్ ఒక బలిపశువు :**

బీ.ఆర్.ఎస్ పాలనలో గ్రామ పంచాయతీలు కాగితాలకే పరిమితమయ్యాయి. నిధులు ఇవ్వకుండా పనులు చేయించారు.

చేసిన పనులకు బిల్లులు విడుదల చేయలేదు.

సర్పంచ్‌లే అప్పులు చేసి, పనులు పూర్తి చేయాల్సి వచ్చింది.

**పంచాయతీ నిధులు నిలిపివేత :**

వర్క్ బిల్లుల బకాయిలు కోట్లలో సర్పంచుల వ్యక్తిగత ఆస్తుల మీద ఒత్తిళ్లు పెరిగాయి..చివరకు ఆత్మహత్యలకు దారి తీసిన నిర్లక్ష్యం బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో నెలకొంది..ఇది పరిపాలనా వైఫల్యం కాదు గ్రామ స్వరాజ్యంపై చేసిన వ్యవస్థాగత దాడి.

**అధికార వ్యవస్థా? ప్రజాప్రతినిధులా? :**

సర్పంచ్‌లు గా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు అయినా, బీ.ఆర్.ఎస్ పాలనలో అధికారులే రాజులు.

సర్పంచ్ మాటకు విలువ లేదు, నిర్ణయానికి శక్తి లేదు. ఎంఎల్ఏ చెప్పిందే వేదంగా గ్రామాలు నడిచాయి.

దీంతో ప్రజల్లో సర్పంచ్‌లకు పరువు పోయింది, పాలనపై నమ్మకం కూలిపోయింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆశల వెలుగు చూపిస్తుందా..? లేక మోసం చేస్తుందా..?

ప్రభుత్వ మార్పుతో సర్పంచ్‌ల్లో కొత్త ఆశలు చిగురించాయి.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు పంచాయతీలకు తగినన్ని నిధులు కావలసినంత స్వాతంత్రం ఇస్తామని చెప్పింది..పెండింగ్ బిల్లుల క్లియరెన్స్

సర్పంచ్‌లకు గౌరవం అందిస్తామని మాట ఇచ్చింది..

కానీ ఈ వాగ్దానం కూడా మాటలకే పరిమితమవుతుందా? లేక విధానంగా మారుతుందా?

ఇప్పటివరకు చూస్తే బిల్లుల క్లియరెన్స్‌పై స్పష్టత లేదు పంచాయతీ ఎన్నికలపై ఆలస్యం..గ్రామ పాలనకు కావలసిన ఆర్థిక స్వావలంబన ఇంకా దూరమే కాంగ్రెస్ కూడా అదే అధికార యంత్రాంగాన్ని నడుపుతుంటే, సర్పంచ్ బతుకు మారుతుందా..?

సర్పంచ్‌లను పట్టించుకోని పాలన ఏదైనా సరే.. గ్రామ వ్యవస్థ కూలిపోతుంది. అభివృద్ధి అటకెక్కుతుంది. ప్రజాస్వామ్యం గ్రామస్థాయిలోనే చచ్చిపోతుంది.

సర్పంచ్ బలహీనమైతే, గ్రామం బలహీనమవుతుంది.

గ్రామం బలహీనమైతే, రాష్ట్రం బలహీనమవుతుంది.

*** సర్పంచ్‌లకు కావాల్సింది దయ కాదు హక్కు :**

కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా మార్పు కోరుకుంటే పెండింగ్ బిల్లుల తక్షణ చెల్లింపు చేయాలి.. పంచాయతీలకు నేరుగా నిధుల బదిలీ జరగాలి..

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆధిపత్యం కొనసాగరాదు..

సర్పంచ్‌లకు చట్టబద్ధ రక్షణ కల్పించగలగాలి..ఇవి అమలు చేయాలి. అప్పుడే గ్రామస్థాయిలో మంచి జరుగుతుంది..

బీ.ఆర్.ఎస్ ప్రభుత్వంలో సర్పంచ్‌లు నరకం చూశారు.. ఇది నిజం.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడిస్తే,

పార్టీ మారింది... పాలన మారలేదు అనే విమర్శ తప్పదు.

ఇప్పుడు కాంగ్రెస్ చేతిలో ఉన్నది ఒక్క అవకాశం.ఆ అవకాశం గ్రామాలకోసం వాడితే చరిత్రలో నిలుస్తుంది.

వాడకపోతే మరో ఫెయిల్యూర్ ప్రభుత్వంలా మిగిలిపోతుంది.

**గ్రామ స్వరాజ్యాన్ని నిలబెట్టాలా?**

లేక సర్పంచ్‌లను మరోసారి బలిచేయాలా? అన్నది కాంగ్రెస్ ప్రభుత్వ చేతుల్లోనే ఉంది.




## డిప్యూటీ మేయర్ ఇంద్రకీలాద్రిలో
# కనకదుర్గ అమ్మవారి ప్రత్యేక దర్శనం..

హైదరాబాద్, డిసెంబర్ 18 (భారత శక్తి): గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రత్యేక దర్శనం చేసుకొని విశేష పూజల్లో పాల్గొన్నారు. నగర ప్రజల శాంతి, సంక్షేమం, అభివృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొని ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

# దమ్మన్నపేట గ్రామ అభివృద్ధికి పాటుపడతా

ఉమ్మడి వరంగల్ బ్యూరో (భారత శక్తి) డిసెంబర్18: నాపై నమ్మకం ఉంచి, తనను గెలిపించిన దమ్మన్నపేట గ్రామస్తులకు, సహకరించిన బిఆర్ఎస్ పార్టీ పెద్దలకు, పార్టీ శ్రేణులకు, నాయకులకు దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ దుబాసి నవీన్ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈనెల 17న మూడవ విడత ఎన్నికల్లో భాగంగా జరిగిన సర్పంచ్ ఎన్నికలలో బిఆర్ఎస్ బలపరిచిన దుబాసి నవీన్ తన సమీప అభ్యర్థి పై 65 ఓట్ల మెజారిటీతో సర్పంచ్ గా ఘన విజయం సాధించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాండవుల రాజు ఉప సర్పంచ్ గా ఎన్నికయ్యారు. సర్పంచ్ గా విజయం సాధించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లను గ్రామస్తులు, వివిధ పార్టీల నేతలు, నాయకులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ సర్పంచ్ దుబాసి నవీన్ మాట్లాడుతూ దమ్మన్నపేట గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరిచి, ఆదర్శ గ్రామంగా



తీర్చిదిద్దుతానని, ఈ సర్పంచ్ పదవి కాలంలో గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటానని, గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరిచి, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తానని సర్పంచ్ నవీన్ అన్నారు. అదే విధంగా తనను ఉపసర్పంచ్ గా ఎన్నుకున్న వార్డు మెంబర్లకు ఉప సర్పంచ్ పాండవుల రాజు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గడల ఓం ప్రకాష్, తిగుళ్ల అనిత నాగరాజ్, దాసి వినోద,తిగుళ్ల గుళ్ళ వెంకటేష్, గ్రామస్తులు, యువ నాయకులు, గ్రామ కమిటీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పి సి అండ్ పి ఎన్ డి టి చట్టాన్ని
# పటిష్టంగా అమలు చేయండి

వైయస్సార్ కడప, డిసెంబర్ 18(భారత శక్తి): జిల్లా లో పిసి అండ్ పి ఎన్ డి టి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయం లోని పీజిఆర్ఎస్ సమావేశపు మందిరం నందు జిల్లా లో పిసి&పి ఎన్ డి టి యాక్ట్ ను సమర్థవంతంగా అమలు కు సంబంధించి డిస్టిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ జిల్లా లో అమలవుతున్న లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం అమలులో సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.. జిల్లా లో తక్కువ సెక్స్ రేషియో కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు ఏఅంశం పై పరిశీలించాలన్నారు.జిల్లాలోని 177 స్కానింగ్ సెంటర్స్ ను తరచూ ప్రోగ్రాం ఆఫీసర్స్ ద్వారా తనిఖీలు నిర్వహించాలన్నారు.అనుమానిత స్కాన్ సెంటర్ల




యందు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాలన్నారు. పిసి & పి ఎన్ డి టి యాక్ట్ పైన అవగాహన పెంచాలని,పి సి & పి ఎన్ డి టి యాక్ట్ పైన ఏఆర్టి మరియు సరోగసి చట్టం గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పించాలనన్నారు. ఈ సమావేశంలో గౌ.ఆరవ అదనపు జిల్లా జడ్జి ఎన్. శాంతి,ఇన్చార్జి డిఎం అండ్ హెచ్ ఓ డా. ఉమా మహేశ్వర కుమార్, డిసిహెచ్ఎస్ డా.హిమ దేవి,డి సి హెచ్ జి జి హెచ్ ఆర్.ఎమ్.ఓ.డా.లిల్లీ పుష్పా,అదనపు డీఎంహెచ్వో డా. రవి బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడలలో రాణించాలి : కలెక్టర్ పి.ప్రావీణ్య

- **సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యతో పాటు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ**
- **సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు 35 విభాగాలకు చెందిన ప్రత్యేక కోచ్ లతో క్రీడల్లో శిక్షణ**
- **రాష్ట్రస్థాయి 11వ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి డిసెంబర్ 18 : క్రీడలు వ్యక్తిని ఉన్నతంగా తీర్చిదిద్దడమే కాకుండా, మానసికశారీరక ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం పటాన్చెరువు మండలంలోని ఇస్నాపూర్ తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ (టిజిఎస్ఆర్ఇఐఎస్) లో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్నిప్రారంభించారు.అనంతరం గురుకుల పాఠశాలలో జాతీయ జెండాతో పాటు స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు.క్రీడాకారులతో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు .రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని, క్రీడాకారులతో కలిసి




వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి 11వ స్పోర్ట్స్ మీట్‌కు సంగారెడ్డి జిల్లా వేదిక కావడం ఎంతో సంతోషకరమన్నారు. నిత్యజీవితంలో ముఖ్యంగా అమ్మాయిలకు క్రీడలు, ఫిట్నెస్ అత్యంత అవసరమని తెలిపారు.పాఠశాల, కళాశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడల్లో ప్రావీణ్యం సాధించిన క్రీడాకారులు విద్య, ఉద్యోగాలు మాత్రమే కాకుండా జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జిల్లాలో జరగడం హర్షించదగ్గ విషయం అన్నారు. క్రీడా పోటీల నియమ నిబంధనల ప్రకారం విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. క్రీడల ద్వారా అమ్మాయిలు శారీరక మానసిక దృఢత్వాన్నిపొందించుకోవచ్చన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి, క్రీడాశాఖలు అన్ని క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు క్రీడాకారులు ఎదగాలనిఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపుతో వచ్చే పతకాలు మాత్రమే గొప్పవి కాదని, క్రీడల్లో పాల్గొనడమే నిజమైన విజయమని విద్యార్థులకు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు మూడు రోజుల పాటు జరిగే స్పోర్ట్స్ మీట్‌లో అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వివిధ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలను కళాశాలల్లో చదివే విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు 35 విభాగాలకు చెందిన నిష్ణాతులైన కోచులతో విద్యార్థులకు వారికి ఆసక్తి ఉన్న క్రీడలలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలనునిర్వహిస్తున్నట్లు తెలిపారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.